జ్ఞాని పురుష్ దాదా భగవాన్ నిర్వచించిన

# సేవ-పరోపకారం



మీ ఫలాలను మీరు ఇతరులకు ఇస్తే, మీకు

కావలసిందంతా ప్రకృతే చూసుకుంటుంది

Telugu

జ్ఞాని పురుష్ దాదా భగవాన్ నిర్వచించిన

# సేవ-పరోపకారం

మూల గుజరాతి సంకలనం - డా.నీరు బెహన్ అమీన్

తెలుగు అనువాదం - మహాత్మగణం

**ప్రకాశకులు** : అజీత్ సి.పటేల్
దాదా భగవాన్ విజ్ఞాన్ ఫౌండేషన్
1, వరుణ్ అపార్ట్‌మెంట్, 37,శ్రీమాలి సొసైటీ
నవరంగ్‌పురా పోలీస్ స్టేషన్ ఎదురుగా,
నవరంగ్‌పురా, అహ్మదాబాద్ - 380009
గుజరాత్, భారత్
**ఫోన్:** + 91 79 3500 2100

© Dada Bhagwan Foundation,
5, Mamta Park Society, B\h. Navgujarat College,
Usmanpura, Ahmedabad -380014, Gujarat, India.
**Email :** info@dadabhagwan.org
**Tel :** + 91 79 3500 2100

**All Rights Reserved. No part of this publication may be shared, copied, translated or reproduced in any form (including electronic storage or audio recording) without written permission from the holder of the copyright. This publication is licensed for your personal use only.**

**First Edition** : June 2024 (500 copies)

**భావ మూల్యం** : 'పరమ వినయం', మరియు "నాకు ఎంతమాత్రం తెలియదు. అదే భావన

**Price** : Rs. 40

**ముద్రిక** : అంబా మల్టి ప్రింటింగ్
B-99, ఈలెక్ట్రానిక్స్ GIDC
క-6, రోడ్డు సెక్టర్-25
గాంధీనగర్ - 382044
గుజరాత్, India
**ఫోన్:** +91 79 3500 2142

**ISBN/eISBN** : 978-93-91375-58-4

**Printed in India**

# త్రిమంత్రం

(సర్వ విఘ్న నివారణ చేసే మంత్రం)







నమో అరిహంతాణం

నమో సిద్ధాణం

నమో ఆయరియాణం

నమో ఉవజ్ఝాయాణం

నమో లోయే సవ్వ సాహూణం

ఏసోపంచణమోక్కారో,

సవ్వాపావప్పణాసణో

మంగళా ణం చ సవ్వేసిం,

పడమం హవయీ మంగళం

ఓం నమో భగవతే వాసుదేవాయ

ఓం నమో శివాయ

జై సచ్చిదానంద



# దాదా భగవాన్ ఎవరు?

అది జూన్ 1958 లో ఒక సాయంత్రం సమయం సుమారు 6:00, ప్రదేశం రద్దీగా ఉన్న సూరత్ పట్టణ రైల్వే స్టేషన్‌లో ప్లాట్‌ఫార్మ్ నం. 3.లో బెంచీ మీద కూర్చునివున్న శ్రీ అంబాలాల్ మూల్జీ భాయ్ పటేల్ అనే దేహమందిరంలో, ప్రకృతిపరంగా, అక్రమ రూపంలో, ఎన్నో జన్మలుగా వ్యక్తమయ్యేందుకు ఆత్రుతగా ఎదురుచూస్తున్న 'దాదా భగవాన్' పూర్ణ రూపంలో ప్రకటితమయ్యారు, ఆధ్యాత్మిక అద్భుతంలా. ఒక గంట సమయంలోనే ఆయనకు విశ్వ దర్శనం అయింది. "నేనెవరు? భగవంతుడు ఎవరు? విశ్వాన్నంతా ఎవరు నడిపిస్తున్నారు? కర్మ అంటే ఏమిటి? ముక్తి అంటే ఏమిటి?" ఇలాంటి ప్రపంచంలో ఆధ్యాత్మిక ప్రశ్నలన్నిటికీ సమాధానం వచ్చింది. ఈ విధంగా దైవం, విశ్వానికి సంబంధించిన ఒక అద్వితీయమైన పూర్ణ స్వరూప దర్శనం కావించింది, దాని ఫలస్వరూపమే శ్రీ అంబాలాల్ మూల్జీ భాయ్ పటేల్, గుజరాత్‌లోని చరోతర్ క్షేత్రంలోని భాదరణ్ గ్రామంలో పాటీదార్, ఒక కాంట్రాక్ట్ పని చేసే వ్యక్తి, అయినా కూడా సంపూర్ణ వీతరాగ పురుషుడు.

"వ్యాపారంలో ధర్మం పాటించాలి కాని, ధర్మాచరణలో వ్యాపారం చేయగూడదు" అనే సిద్ధాంతంతోనే ఆయన జీవితమంతా గడిపారు. ఆయన ఎప్పుడూ ఎవరి దగ్గరి నుంచీ డబ్బు తీసుకోలేదు సరికదా తన ఆదాయం నుంచే తీర్థయాత్రలు చేసే భక్తులకు ఆర్థిక సహాయం చేసారు.

ఆ విధంగా ఆయనకు కేవలం రెండు గంటలలోనే సిద్ధించిన అద్భుతమైన జ్ఞానాన్ని ఉపయోగించి, ఆయన ఎందరో ముముక్షువులకు ఆత్మజ్ఞానాన్ని ప్రసాదించారు. దాన్ని ఆయన అక్రమ మార్గం అని అన్నారు. అక్రమ అంటే ఒక క్రమం లేని అర్థం. క్రమం అంటే ఒక మెట్టు పైన మరో మెట్టుని క్రమంగా ఎక్కుతూ వెళ్ళటం. అక్రమ మార్గమంటే షార్ట్‌కట్‌లో లిఫ్ట్ ద్వారా పైకి చేరుకోవటం.

ఆయన "దాదా భగవాన్ ఎవరు" అన్న రహస్యాన్ని స్వయంగా చెప్తూ, "మీ ముందు కనిపిస్తున్న ఈ ఆకారం దాదా భగవాన్ కాదు. ఈయన ఎ.ఎమ్.పటేల్. మేము ఒక జ్ఞానపురుషుడను, లోపల ప్రకటితమైనది దాదా భగవాన్. దాదా భగవాన్, 14 లోకాలకు నాధుడు. ఆయన మీలో కూడా ఉన్నాడు. అందరిలోనూ ఉన్నాడు. మీలో అవ్యక్త రూపంలో ఉన్నాడు, నాలో సంపూర్ణ రూపంలో వ్యక్తమై ఉన్నాడు. ఆ దాదా భగవాన్ గారికి నేను కూడా ప్రణామం చేస్తాను".

# విన్నపం

జ్ఞాని పురుషులు పూజ్య దాదాభగవాన్ శ్రీముఖం నుంచి వెలువడ్డ ఆధ్యాత్మిక, వ్యావహారిక జ్ఞానానికి సంబంధించిన వాణిని రికార్డ్ చేసి, దానిని సంకలన సంపాదకీయాలతో పుస్తక రూపంలో ప్రచురించటం జరుగుతుంది. వివిధ విషయాల మీద వెలువడిన అద్భుతమైన సారస్వత సంకలనాన్ని ఈ పుస్తకాలలో చూస్తారు. అవి కొత్తగా చేరిన పాఠకులకు కూడా ఒక వరంలా పనిచేస్తుంది.

ఈ అనువాదాలలో, స్వయంగా దాదాజీ వాణిలాగానే వినిపించే విధంగా ఉండేందుకు విశేష ప్రయత్నాలు జరిగాయి. ఈ కారణంగా కొన్ని సందర్భాలలో తెలుగు వ్యాకరణానికి భిన్నంగా ఉందనిపించవచ్చు. కానీ, దాని వెనుకనున్న లక్ష్యాన్ని పరిగణనలోకి తీసుకుంటే ప్రయోజనకరంగా ఉంటుంది.

ఈ పుస్తకంలో ఎన్నో చోట్ల నిఘంటువులలోని వాక్యాలు కాక, దాదాశ్రీ ఉపయోగించిన వ్యాక్యాలను ఎక్కువ స్పష్టత రావటం కోసం తీసుకుని రాయటం జరిగింది. అందువలన కొన్ని చోట్ల ఇంగ్లీషు పదాలనే దీనికి మూలమైన హిందీ పుస్తకంలో హిందీ పదాలలా రాయటం జరిగింది. అదే దాదాశ్రీ శ్రీముఖం నుంచి వెలువడిన గుజరాతీ మాటలనైతే యథాతథంగా ఇటాలిక్స్‌లో రాయటం జరిగింది. ఎందుకంటే, వాటికి సమానమైన, వాటి పూర్తి అర్థాన్నిచ్చే హిందీ పదాలు లేవు కనుక. కాకపోతే వాటికి దగ్గర్లో ఉన్న హిందీ పదాలను ఆ పుస్తకాలలో చివర్లో ఇచ్చారు.

ఒక జ్ఞాని వాక్యాలను హిందీలో అనువాదం చేయటానికి వారి వంతు ప్రయత్నం చేసామని చెప్తున్నారు. అదే ప్రయత్నం తెలుగులో కూడా జరిగింది. కాకపోతే దాదాశ్రీ అందించిన ఆత్మజ్ఞానాన్ని యథాతథంగా పొందాలంటే, దాన్ని గుజరాతీలో చదివితేనే ఆ పని పూర్తిగా జరుగుతుంది. జ్ఞానపు లోతులలోకి వెళ్ళాలంటే, ఆ వాక్యాలలోని మర్మాన్ని పూర్తిగా అవగతం చేసుకోవాలంటే గుజరాతీ భాషను నేర్చుకోమని మేమివ్వగల సలహా.

అనువాదంలోని లోపాలకు మమ్మల్ని క్షమించవలసిందిగా ప్రార్థన.

# సంపాదకీయం

మనోవాక్కాయ కర్మలతో ఇతరులకు మంచి చేసినట్లయితే ఈ ప్రపంచంలో మనకంటూ ఎంతో మంచి జరగటం ఖాయం. అలాగే, స్వయంగా సెల్ఫ్ రియలైజేషన్ కోసం పాటుపడితే, ఆత్మపరమైన సుఖశాంతులు లభిస్తాయి. మనిషి జీవిత లక్ష్యం ఇంతే. ఈ లక్ష్యాన్ని దృష్టిలో పెట్టుకుని ముందుకు నడిచినట్లయితే, మానవ జీవితం నుంచే జీవన్ముక్తిని పొందే అవకాశం ఉంటుంది. ఆ తర్వాత మరేమీ పొందవలసిన అవసరమే ఉండదు.

మామిడి చెట్టు తనకోసం ఎన్ని కాయలను తింటుంది? దాని పండ్లు, కాండం, కొమ్మలు, ఆకులు, ఇతరులకే కదా పనికి వచ్చేవి? ఫలితంగా లభించేది ఊర్ధ్వగతే. ధర్మమార్గంలో ముందడుగు పడేది ఒబ్లియిజింగ్ నేచర్ (పరోపకార స్వభావం) తోనే. ఇతరులకు ఇవ్వటం మొదలుపెట్టినప్పటి నుంచే తనకంటూ ఆనందం లభించటం ప్రారంభమౌతుంది.

పరమ పూజ్య దాదాశ్రీ ఈ విషయాన్ని ఒకే ఒక్క వాక్యంలో చెప్తారు. తల్లిదండ్రుల సేవచేసే పిల్లలకు ఆర్థిక సమస్యలు ఎప్పుడూ ఉండవు. వాళ్ళ అవసరాలన్నీ తీరిపోతుంటాయి. అలాగే, ఆత్మసాక్షాత్కారం కోసం గురుసేవ చేస్తే వారికి మోక్షప్రాప్తి లభిస్తుంది.

దాదాశ్రీ తన జీవితకాలమంతా పెట్టుకున్న ధ్యేయం ఏమిటంటే, జీవితంలో నాకు ఎవరు తటస్థపడతారో వాళ్ళంతా సుఖశాంతులతో జీవించాలి అని. ఆయన తన కోసం సుఖశాంతులను ఏనాడూ ఆశించలేదు. ఎదుటివారికున్న సమస్యలేమిటి, ఆ సమస్యలు ఎలా దూరమవాలి అనే భావనలో ఎల్లప్పుడూ ఉంటారు. అందుకే ఆయనలోంచి కరుణ ఉబుకుతుంటుంది. అద్భుతమైన ఆధ్యాత్మికత జాలువారుతుంది.

ఈ సంకలనంలో, ఏ దృష్టికోణంతో చూసినా, జీవిత ధ్యేయాన్ని ఎలా పూర్తిచేసుకోవాలి, పరోపకార భావనతో ఉండే సేవ ఎలా ఉంటుంది, ఆ అవగాహనను సరళమైన, సరైన ఉదాహరణల ద్వారా ఫిట్ అయ్యేటట్లుగా ఆయన చేసారు. వాటిని జీవితం ఆత్మపరంగా అనుసరించినట్లయితే, వారి మానవ జీవనం సార్థకమౌతుందని చెప్పవచ్చు.

–డా. నీరూ బెహన్ అమీన్

## దాదా భగవాన్ నిర్వచించిన

# సేవ-పరోపకారం

### మానవ జన్మ విశేషం

**ప్రశ్నకర్త :** ఈ మానవావతారం వ్యర్థమైపోకుండా ఉండాలంటే ఏం చెయ్యాలి?

**దాదాశ్రీ :** ఈ మానవావతారం వ్యర్థమైపోగూడదనే చింతనతోనే రోజంతా గడిపితే అది సఫలమౌతుంది. ఈ మానవావతారం మీద చింతన పెట్టుకోకుండా, మానవులు లక్ష్మీచింతనతోనే గడుపుతున్నారు. ఏదైనా జరిగేటట్లు చూడటం మీ చేతుల్లో లేదు కానీ, అటువంటి భావనలో ఉండటం మాత్రం మీ చేతుల్లోనే ఉంది. ప్రయత్నం చేయటం పరాధీనంలో ఉంటుంది. భావం వలన ఫలం లభిస్తుంది. నిజానికి భావం కూడా పరాధీనమే. కాని, భావం వలన దాని ఫలితం అందుతుంది.

**ప్రశ్నకర్త :** మనిషి జన్మకున్న విశేషమేమిటి?

**దాదాశ్రీ :** మనిషి జీవితం ఉన్నది పరోపకారం కోసం. కానీ భారతదేశంలో మనుషుల జీవితం "ఆబ్సల్యూటిజమ్" కోసం- ముక్తి కోసం.

భారతదేశం కాకుండా ఇతర దేశాలలో జీవించే విధానంలో పరోపకారం అనేది ఉంది. పరోపకారం అంటే మనసుని కూడా ఇతరుల కోసం ఉపయోగించటం, మాటలను ఇతరుల కోసం ఉపయోగించటం, తన ప్రవర్తనలు కూడా ఇతరుల కోసం చేయటం. మనోవాక్కాయకర్మలతో చేసే పరోపకారం! మరి నా సంగతేమిటి అని అంటారేమో. పరోపకారమే చేసుకుంటూ పోతే అతని ఇంట్లో మరేం మిగుల్తుంది?

**ప్రశ్నకర్త :** లాభమైతే ఉంటుంది కదా?

**దాదాశ్రీ :** ఔను. నిజమే కాని మనుషులు ఏమనుకుంటారు, నేను ఇచ్చేసుకుంటూపోతే, నాదంతా పోతుంది కదా అని.

**ప్రశ్నకర్త :** కింద స్థాయిలో ఉన్నవారు అలాగే అనుకుంటారు.

**దాదాశ్రీ :** పై స్థాయిలో ఉండేవారు, ఇతరులకు ఇవ్వొచ్చు అనే అనుకుంటారు.

## జీవతమున్నది పరోపకారం కోసం

ఇందులో మర్మమైన సైన్స్ ఏమిటంటే, మనోవాక్కాయ కర్మలతో పరోపకారంలో జీవిస్తే, మీకు ఇక్కడ అన్ని వస్తువులు లభిస్తాయి. పరోపకారం కోసం చెయ్యటం కాకుండా, ఫీజు తీసుకుని చేస్తే?

**ప్రశ్నకర్త :** కష్టాలు ఎదురౌతాయి.

**దాదాశ్రీ :** కోర్టులో ఫీజు తీసుకుంటారు కదా. వందో, నూటయాభయ్యో ఉండొచ్చు. అప్పుడు, “అయ్యా నూటయాభై ఇవ్వండి” అంటారు. కానీ పరోపకార చట్టం వర్తించదు కదా.

**ప్రశ్నకర్త :** కడుపులో కాలుతుంటే అలా చెయ్యక తప్పదు కదా?

**దాదాశ్రీ :** అలాంటి ఆలోచనే వద్దు. ఎటువంటి పరోపకారం చేసినా మీకు ఎటువంటి కష్టాలు కలుగవు కానీ, మనుషులు ఎలా అనుకుంటారో తెలుసా? సగం సగం అర్థం చేసుకుని చెయ్యబూనుతారు. అందుకే 'ఎఫెక్ట్' వ్యతిరేకంగా ఉంటుంది. దానితో మనసులో శ్రద్ధ అనేది ఉండకుండా పోతుంది. ఈ రోజు పాటించటం మొదలుపెడితే, రెండు, మూడు జన్మలకి అది అలవడుతుంది. ఇదే సైన్స్.

## మంచైనా, చెడ్డైనా, ఒకేలాంటి పరోపకారం

**ప్రశ్నకర్త :** మనిషి మంచి, చెడుల కోసం పరోపకారంలో జీవిస్తాడు, ఆ విషయం చెప్తాడు కూడా. కానీ అతను మంచి కోసం చెప్పినా, "ఇతను నా మంచి కోసం చెప్పాడు" అని అనుకోవటానికి ఎవరూ సిద్ధంగా లేరు. దానికేమంటారు?

**దాదాశ్రీ :** విషయం ఏమిటంటే, పరోపకారం చేసేవాడు ఇతరులు ఎంత అర్థం చేసుకున్నారన్నది చూడడు. ఒకవేళ పరోపకారం చేసేవాడు ఎదుటి మనిషి ఎంత అర్థం చేసుకున్నాడన్నది చూస్తే దాన్ని వకాలత్ అంటారు. అందువలన ఎదుటి మనిషి ఎంత అర్థం చేసుకున్నాడన్నది చూడనే కూడదు.

ఈ చెట్లను చూడు, వీటిలో మామిడి, వేప ఉన్నాయి. వాటికి పండ్లు వస్తాయి కదా! అప్పుడు మామిడి చెట్టు ఎన్ని మామిడి పండ్లు తింటుండొచ్చు?

**ప్రశ్నకర్త :** ఒక్కటి కూడా తినదు

**దాదాశ్రీ :** అవి మరి ఎవరి కోసం ఉన్నాయి?

**ప్రశ్నకర్త :** ఇతరుల కోసం

**దాదాశ్రీ :** ఔనా, మరి అది ఇతను మంచివాడు, అతను చెడ్డవాడు అని

చూస్తుందా? ఎవరు తీసుకుంటే వాళ్ళదే కాని నాది కాదు. అలా అది పరోపకారి జీవితాన్ని గడుపుతుంది. అలా జీవించటం వలన ఆ జీవులు క్రమక్రమంగా ఊర్ధ్వగతిలో వెళ్తాయి.

**ప్రశ్నకర్త :** కానీ, చాలసార్లు ఎవరికైతే ఉపకారం జరుగుతుందో, అదే వ్యక్తి ఉపకారం చేసిన ఆ మనిషికే దోషాన్ని అంటగడతాడు.

**దాదాశ్రీ :** ఔను. అలాగే కనపడుతుంది కదా! ఉపకారం చేసినవాడికే అపకారం చేస్తాడు.

**ప్రశ్నకర్త :** తెలివి లేకపోవటం వలన.

**దాదాశ్రీ :** ఎక్కడి నుండి తెచ్చుకుంటాడు మరి తెలివిని? తెలివుంటే బావుండేది కదా, మరి ఎక్కడి నుండి తీసుకునివద్దాం అటువంటి తెలివిని?

పరోపకారమనేది చాల గొప్ప స్థితి. అలా పరోపకారం కలిగివుండటమనేదే మనిషి జీవితానికి ధ్యేయం.

## జీవితంలో గొప్ప పనులు ఈ రెండే

రెండవది, భారతదేశంలో మనిషి జన్మ ఎందుకోసం కలిగింది? మనకున్న బంధాలు, శారీరక బంధాలు తెగిపోవటానికే, "ఆబ్సల్యూట్" అవటానికి. మరి అతనికి ఆబ్సల్యూట్ అవటానికి అవసరమైన జ్ఞానమే రాకపోతే, ఇతరుల కోసం జీవించాలి. ఈ రెండు కార్యాల కోసమే భారతదేశంలో పుట్టింది. ఈ రెండు పనులను మనుషులు చేస్తున్నారా? మనుషులేమో కల్తీలలో పడి, మనిషి నుంచి పశువులోకి మారే కళని వెతికి పట్టుకున్నారు.

## సరళోపాయం

**ప్రశ్నకర్త :** జీవితాన్ని సాత్వికంగా, సరళంగా చేసుకునే ఉపాయమేమిటి?

**దాదాశ్రీ :** నీ దగ్గర ఎంత ఉంటే అంత ఒబ్లయిజ్ నేచర్‌తో ఇతరులకు ఇచ్చేస్తుండు. అలా చేస్తేనే జీవితం సాత్వికమౌతుంది. ఒబ్లయిజింగ్ నేచర్ చేసావా నువ్వు? ఒబ్లాయిజింగ్ నేచర్ నీకు నచ్చుతుందా?

**ప్రశ్నకర్త :** కొంతవరకు చేసాను.

**దాదాశ్రీ :** దాన్ని ఇంకా ఎక్కువగా చేస్తే ఇంకా ఎక్కువ లాభం ఉంటుంది. ఒబ్లయిజే చేస్తుండు. ఎవరికోసమైనా వెతికి, వాళ్ళ చుట్టూ తిరిగి, వాళ్ళకి పైసలిచ్చి, లేనివాళ్ళకి రెండు బట్టలు కుట్టించి ఇవ్వు. అలా ఒబ్లయిజ్ చెయ్యి.

భగవానుడు ఏమంటాడంటే, మనసు, వాక్కు, శరీరం, ఆత్మలతో (ప్రతిష్ఠించిన ఆత్మ)లను ఇతరుల కోసం ఉపయోగించు. ఆ తర్వాత నీకేమైనా కష్టమొస్తే నాకు చెప్పు.

ధర్మకార్యం మొదలయ్యేదే ఒబ్లయిజింగ్ నేచర్‌తో. మీరు మీ ఇంట్లో ఉన్న ఇతరులకు ఇచ్చి చూడండి ఎంత ఆనందం కలుగుతుందో. అప్పుడు అంతా తీసుకోవటమనేది నేర్చుకుంటారు. మీరు మీకోసమేమీ దాచుకోవద్దు. ఇతరుల కోసమే చేస్తున్నంతకాలం మీరు మీకోసం ఏమీ చెయ్యవలసిన పని ఉండదు.

## భావంలోనైతే నూటికి నూరు శాతం

ఈ చెట్లలో ఏదైనా తన పండ్లు తాను తింటుందా? లేదు కదా. అలా ఈ చెట్లు మనుషులకు ఇచ్చే సందేశం ఏమిటంటే, మీరు మీ ఫలాలను ఇతరులకు ఇవ్వండి అని. మీకు ప్రకృతే ఇస్తుంది. వేప చేదుగా ఉంటుంది నిజమే కాని, మనుషులు దాన్ని పెంచుతారు. ఎందుకంటే, దాని వలన మరో లాభముంది. అలా లేకపోతే చెట్లను పెరికి పారేస్తారు. కానీ ఆ చెట్టు మరోవిధంగా లాభం చేకూర్చుతుంది. అది నీడనిస్తుంది. దానిలో ఔషధగుణాలున్నాయి. దాని రసం చాల మంచిపని చేస్తుంది. సత్యయుగంలో మనుషులు ఎదుటివారికి

సౌఖ్యాన్నివ్వటానికే చూసేవారు. రోజంతా ఎవరిని ఒబ్లయిజ్ చెయ్యాలన్న ఆలోచనలోనే ఉండేవారు.

బయటకు తక్కువగా ఉంటే పరవాలేదులే కానీ, లోపల మాత్రం భావనలో, నా దగ్గర డబ్బులున్నాయి కదా వాటితో ఎవరి కష్టాలనైనా తగ్గించాలి అని అనుకోవాలి. నా బుద్ధిని  ఉపయోగించైనా నేను ఎవరి కష్టాలైనా తగ్గేలా చూడాలి. నా దగ్గరున్నదేమైనా దానితో ఇతరులకు హెల్ప్ చేయాలి అనే ఒబ్లయిజింగ్ నేచర్ ఉండాలి. ఒబ్లయిజింగ్ నేచర్ అంటే ఏమిటి? ఇతరుల కోసం ఏమైనా చేసే స్వభావం.

ఒబ్లయిజింగ్ నేచర్ ఉండటమనేది ఎంత మంచి స్వభావం! ఒబ్లయిజింగ్ నేచర్ అంటే డబ్బులివ్వటం ఒక్కటే కాదు. డబ్బులు మన దగ్గర ఉండొచ్చు, లేకపోవొచ్చు. కాని, ఏ విధంగా హెల్ప్ చేయగలను అనే భావన, ఆ కోరిక ఉండాలి. ఇంటికి ఎవరైనా వస్తే వాళ్ళకి ఏవిధంగా సహాయపడగలను అనే భావన కలగాలి. డబ్బులు ఇవ్వటం, ఇవ్వలేకపోవటమనేది మీకున్న శక్తినిబట్టి వుంటుంది.

డబ్బుతోనే ఒబ్లయిజింగ్ చేయాలనేమీ లేదు. ఇచ్చేవారికి ఉండే శక్తి మీద అది ఆధారపడివుంటుంది. మనసులో, “ఏవిధంగా సహాయం చేయగలను” అనే భావన ఉండాలి అంతే. అంత చేయండి. అదే చాలు.

## జీవిత ధ్యేయం

మీ ధ్యేయం వైపు మిమ్మల్ని నడిపించేది ఏదైనా సరే. ధ్యేయమనేదే లేకుండా జీవించే జీవితానికి అర్థమనేది ఉండదు. డాలర్లు వస్తుంటే తిని, తాగి అనుభవించటం, రోజంతా విచారంలో గడుపుతుండటం– దీన్ని జీవిత ధ్యేయమని ఎలా అనగలం? లభించిన మానవ జన్మ వ్యర్థమైతే ఏమిటి అర్థం? అందువలన,

మనిషి జన్మ లభించిన తర్వాత, మన ధ్యేయాన్ని సాధించాలంటే ఏం చెయ్యాలి? ప్రపంచంలో సౌఖ్యం కావాలా భౌతిక సుఖం? అయితే మీ దగ్గర ఏముందో దాన్ని ఇతరులకు ఇచ్చేయండి. మీరు ఇతరులకు ఎంతైనా సౌఖ్యాన్ని అందిస్తేనే, మీరు సుఖాన్ని ఆశించవచ్చు. లేకపోతే మీకు సుఖమనేదే లభించదు. ఒకవేళ మీరు ఇతరులకు దు:ఖాన్ని కలిగిస్తే మీకు లభించేది కూడా దు:ఖమే.

ఈ ప్రపంచంలో సూత్రాన్ని ఒక్క ముక్కలో తెలుసుకో, ఈ ప్రపంచంలోని ధర్మాన్ని. ఎవరైతే సుఖాన్ని కోరుకుంటారో, వాళ్ళు ఇతర జీవులకు సుఖాన్ని చేకూర్చాలి. దు:ఖం కావాలంటే ఇతరులకు దు:ఖాన్నివ్వండి. ఇందులో మీకు ఏది అనుకూలంగా ఉంటుందో అది చేయండి. “ఇతరులకు మనం సౌఖ్యాన్ని ఎలా కలిగించగలం? మా దగ్గర డబ్బులు లేవు కదా!” అని ఎవరైనా అడిగితే, డబ్బులతోనే కలిగించగలం అనేమీ లేదు. దానికి బదులు ఒబ్లయిజింగ్ నేచర్ కలిగివుండండి. ఆ మనిషి కోసం తిరిగి రావొచ్చు, సలహాలు ఇవ్వవచ్చు, అలా ఎన్నో రకాలుగా ఒబ్లయిజ్ చేయగలుగుతారు. అదీ సంగతి.

ధర్మమంటే ఏమిటి? దేవుడి విగ్రహాల ముందు కూర్చునివుండటం, అది కాదు ధర్మమంటే. ధర్మమంటే మనం మన ధ్యేయాన్ని చేరుకోవటం. అదీ ధర్మమంటే. దానితోపాటు ఏకాగ్రత కోసం ఏదైనా సాధనను చేపట్టవచ్చు, అది వేరు. కాని, ఇందులో ఏకాగ్రత పెట్టుకుంటే, ఇందులో అంతా ఏకాగ్రమే. ఒబ్లయిజింగ్ నేచర్‌తో ఉండు. ఇప్పుడిక అందరికీ ఒబ్లయిజే నేను చెయ్యవలసింది అని నిశ్చయించుకో. మీలో పరివర్తన వచ్చేస్తుంది. నేను వైల్డ్‌నెస్ (జంతువు లా) చెయ్యగూడదు అని నిశ్చయించుకో.

ఎదుటి మనిషి వైల్డ్ (జంతువులా) అయిపోయినా, నేను మాత్రం కాను. అలా జరుగుతుంది కదా, జరగదా? నిశ్చయించుకుంటూ క్రమక్రమంగా పరివర్తన కలుగుతుందా కలగదా?

**ప్రశ్నకర్త :** కాని కష్టమైన పని.

**దాదాశ్రీ :** కాదు. కష్టమైన పనైనా ధృఢ నిశ్చయం చేసుకో. ఎందుకంటే మీరు మనిషి కదా. భారతదేశ మనిషి! అల్లాటప్పా కాదు. ఋషి, మునుల సంతానం మీరు. మీలో గొప్ప శక్తులున్నాయి. కాని అవి మూసుకునిపోయి వుంటే మీకేం పనికొస్తుంది? అందువలన నా ఈ వాక్యాలకు అనుగుణంగా, నేనీ పని చేయవలసిందే అని నిశ్చయం చేసుకొంటే అది తప్పక ఫలిస్తుంది. లేకపోతే ఇలా వైల్డర్‌నెస్ ఎంతకాలం చేస్తుంటారు? పైగా మీకు సుఖం లభించదు. వైల్డర్‌నెస్‌లో సుఖం లభిస్తుందా ఏమిటి?

**ప్రశ్నకర్త :** లేదు.

**దాదాశ్రీ :** అందుకు వ్యతిరేకంగా దుఃఖాన్నే ఆహ్వానిస్తూవుంటావు.

## పరోపకారంతో పుణ్యం

మోక్షం లభించేంతవరకు పుణ్యమే మన ఏకైక మిత్ర సమానుడు, పాపం శత్రు సమానుడు. మరి మీరు మిత్రుడితో ఉంటారా లేక శత్రువుతోనా. మీకు ఏది సరైనది అనిపిస్తే అది చేయండి. మిత్రునితో సాంగత్యం ఎలా కలుగుతుందని అడగండి, అలగాం, శత్రువు నుంచి విముక్తి ఎలా కలుగుతుందని కూడా అడగండి. ఒకవేళ శత్రువే మీకు నచ్చితే శత్రువుతో సాంగత్యం ఎలా పొందాలని అడగితే, అతనికి నేను చెప్పేదేమిటంటే, ఎంత వీలైతే అంత నెయ్యి అప్పు తీసుకుని తాగండి. ఎక్కడికి కావాలంటే అక్కడికి తిరగండి, ఎలా నచ్చితే అలా జల్సాగా తిరగండి. ఏమైతే అదవుతుంది చూద్దాం అప్పుడు! ఒకవేళ పుణ్య రూపంలో ఉండే మిత్రుడు కావాలంటే నేను చెప్పేది ఏమిటంటే, బాబూ, ఆ చెట్టు దగ్గరకు పోయి నేర్చుకో. ఏ వృక్షమైనా తన పండ్లను తానే తింటుందా? గులాబి మొక్క ఏదైనా తన పూలను తానే తింటుందా? కొంచెం తింటుందేమో కదా! మనం లేకపోవటం చూసి రాత్రిపూట తినేస్తుంటుందేమో! ఏమిటి కాదా, అలా తినదా?

**ప్రశ్నకర్త :** లేదు తినదు.

**దాదాశ్రీ :** ఈ మొక్కలు, చెట్లు అన్నీ మనుషులకు పండ్లు ఇవ్వటానికి, సేవచేయటానికి ఉన్నాయి. దానివలన ఆ చెట్లకి ఏం లభిస్తుంది? ఊర్ధ్వగతి సంప్రాప్తిస్తుంది, వాటి సహాయంతో మనుషులు జీవితంలో ముందుకు సాగుతారు. ఆలోచించు. మనం మామిడి పండు తింటే అందులో మామిడి చెట్లు పోగొట్టుకున్నది ఏమిటి, మనకు ఒరిగింది ఏమిటి? మనం మామిడి పండు తినటం వలన మనకి ఆనందం కలిగింది. దానివలన మన ప్రవృత్తిలో తేడా వచ్చింది, దానితో మనం ఆధ్యాత్మికంగా ఒక వంద రూపాయల వంతు సంపాదిస్తాం. మనం మామిడి పండు తిన్నాం కనుక మన వాటాలోంచి ఐదు శాతం మామిడి చెట్టుకి పోతుంది, తొంభైఐదు శాతం మీ ఖాతాలో ఉండిపోతుంది. వాళ్ళు ఐదు శాతం తీసుకుని ఊర్ధ్వగతిలోకి వెళ్తారు, మనకి ఎలాంటి అధోగతి ఉండదు. మనం కూడా ముందుకు సాగుతాం. అలా ఈ చెట్లు చెప్పేదేమిటంటే, భోగించు, అన్ని రకాల ఫలపుష్పాలను ఉపయోగించు అని.

## యోగా ఉపయోగం పరోపకారం కోసం

అందువలన ఈ ప్రపంచం మీకు నచ్చినట్లయితే, ప్రాపంచిక వస్తువుల మీద ఇష్టం కలిగినట్లయితే, ప్రాపంచిక విషయాల మీద వాంఛ కలిగినట్లయితే, మీరు చెయ్యవలసిందంతా ఇంతే, "యోగా ఉపయోగం పరోపకారం కోసం". యోగమంటే మనోవాక్కాయకర్మల సంయోగం. ఉపయోగం అంటే బుద్ధి, మనసు, చిత్తాలను ఉపయోగించటం, వీటన్నిటినీ ఇతరుల కోసం ఉపయోగించటం. ఇతరుల కోసం ఖర్చు పెట్టకపోతే మనవాళ్ళు కనీసం కుటుంబ సభ్యుల కోసమైనా ఖర్చు పెడతారు కదా. ఈ కుక్కకి తినటానికి ఎందుకు దొరుకుతుంది? ఆ పిల్లలకు సేవ చేస్తుంది కనుకనే దానికి అన్నీ దొరుకుతాయి. ప్రపంచమంతా అలాగే నడుస్తుంది. ఈ చెట్లకి ఎరువు ఎక్కడి నుండి లభిస్తుంది? ఈ చెట్లేమైనా

పురుషార్థం చేసాయా? అవి ఏమాత్రం "ఇమోషనల్" అవవు. అవెప్పుడైనా "ఇమోషనల్" అవుతాయా? అవి వెనక్కి ముందుకీ కదలను కూడా కదలవు. ఒక మైలు దూరంలో విశ్వామిత్రీ నది ఉంది, అక్కడికి పోయి నీళ్ళు తాగి రానా అని ఎప్పుడూ దానికి ఎప్పుడూ అనిపించదు.

ప్రామాణికత, పరస్పర "ఒబ్లయిజింగ్ నేచర్". అంతే ఆ మాత్రం ఉంటే చాలు. మనిషికి జీవితంలో లభించిన గొప్ప విషయం పరస్పరం ఉపకారాలు చేసుకోవటమే. ప్రపంచంలో రెండు రకాల మనుషులకు చింత ఉండదు. ఒకరు జ్ఞాని పురుష్, రెండు పరోపకారి!

## పరోపకారం చేయవలసిన సరైన రీతి

**ప్రశ్నకర్త :** ప్రపంచంలో మంచి పని అని దేన్ని అంటారు? దానికి నిర్వచనం ఇవ్వగలమా?

**దాదాశ్రీ :** తప్పకుండా. మంచి పనులు ఈ చెట్లు చేస్తుంటాయి. అవన్నీ మంచి పనులనే చేస్తాయి. కాని తాను కర్తను అనే భావంలో ఉండవు. చెట్లు సజీవంగా ఉంటాయి. ఇతరుల కోసం తన పండ్లను ఇస్తాయి. మీరు కూడా మీ ఫలాలను ఇతరులకు ఇవ్వండి. మీకు అందాల్సిన ఫలం మీకు అందుతుంది. మీ నుంచి ఉత్పన్నమయే మీ ఫలాలు- దైహికం కాని, మానసికం కాని, వాచక రూపంలో కాని, ఇతరులకు "ఫ్రీ ఆఫ్ కాస్ట్" ఇస్తుండు. మీకు కావలసినవన్నీ మీకు సమకూరుతాయి. మీ జీవితావసరాలకు ఎటువంటి లోపం ఉండదు. మీ ఫలాలను మీరే తిన్నప్పుడే వస్తుంది తంటా అంతా. మామిడి చెట్టు తన పండ్లను తానే తినేస్తుంటే దాని యజమాని ఏం చేస్తాడు? దాన్ని కొట్టిపారెయ్యడూ? అలాగే వీళ్ళంతా తమ పండ్ల తామే తింటుంటారు. అంతేకాదు, దానికి తోడు ఫీజు కూడా అడుగుతుంటారు.

ఒక అప్లికేషన్‌ని రాయటానికి ఇరవై రెండు రూపాయలు అడుగుతారు. "ఫ్రీ ఆఫ్ కాస్ట్ వకాలత్ చేసే దేశంలో, పైగా తన ఇంట్లో భోజన సదుపాయాలు చేసి మరీ వకాలత్ చేసేవారు, అలాంటి చోట ఈ పరిస్థితి ఏర్పడింది. ఏదైనా గ్రామంలో జగడం జరిగితే, ఆ గ్రామ వకీలు తగువులాడే వాళ్ళిద్దరితో, "అన్నా చందూ భాయ్, ఈ రోజు పదిన్నర గంటలకి మా ఇంటికి రా. నువ్వు నగీన్ దాస్, అదే సమయంలో మా ఇంటికి రా" అంటాడు. నగీన్ దాస్ స్థానంలో ఒకవేళ ఎవరైనా పనిచేసే మనిషి, రైతు ఉంటే, వాళ్ళిద్దరూ దెబ్బలాడుకుంటుంటే, వాళ్ళని ఇంటికి పిలుస్తాడు. ఇద్దరినీ కూర్చోబెట్టి, ఇద్దరి మధ్య రాజీ చేస్తాడు. అందులో ఎవరికైతే డబ్బులు కట్టవలసివుందో అతనికి కొద్దిగా డబ్బు ఇప్పించి, మిగతా డబ్బు వాయిదాలలో తీర్చే ఏర్పాటు చేస్తాడు. ఆ తర్వాత ఇద్దరినీ, "పద నాతో కలిసి భోజనం చేయండి" అంటాడు. ఇద్దరికీ భోజనం పెట్టించి ఇంటికి పంపించేస్తాడు. ఇప్పుడుంటారా అలాంటి వకీలు? అందువలన అర్థం చేసుకో, సమయానుకూలంగా ముందుకు సాగు. ఒకవేళ నువ్వు నీ కోసమే చేస్తుంటే, చనిపోయేటప్పుడు చాల కష్టమౌతుంది. జీవుడు బయటకు పోడు. బంగ్లా, మోటర్ కార్లను విడిచి పోలేడు!

సలహా ఇవ్వటానికి డబ్బు అడిగేవారు కాదు. ఏదోవిధంగా గడిపేవారు. ఇంట్లోంచి రెండు వేల రూపాయలు తీసిచ్చేవారు. ఇప్పుడు సలహా అడగటానికి పోతే, రెండు వందల రూపాయలు ఫీజు తీసుకుంటారు. "అరె, మీరు జైన్ కదా" అంటే, "జైన్‌ని నిజమే కాని, మేము వ్యాపారం చెయ్యాలా వద్దా?" అంటారు. అయ్యా, సలహా ఇవ్వటానికి కూడా ఫీజా? భగవంతుడిని కూడా సిగ్గుపడేట్లు చేసారు కదా! వితరాగులను కూడా సిగ్గుపడేట్లు చేసారు కదా! నోహౌ కి ఫీజా? దీన్ని ఎలాంటి తుఫాను అనాలి?

**ప్రశ్నకర్త :** అది మనకున్న అదనపు బుద్ధికి ఫీజు అని అంటారు కదా?

**దాదాశ్రీ :** బుద్ధికి విరోధం కాదు. కానీ ఇది విపరీత బుద్ధి. తనకు తానే నష్టం చేసుకునే బుద్ధి. విపరీత బుద్ధి. భగవంతుడు బుద్ధి ఉండటాన్ని వ్యతిరేకించలేదు. సంమ్యక్ బుద్ధి అనేది ఉంటుంది అంటాడు భగవంతుడు. ఆ బుద్ధి పెరిగినప్పుడు మనసులో, దాన్ని తీసి ఎవరెవరికివ్వను, ఎవరెవరికి హెల్ప్ చేయను అనిపిస్తుంది. ఎవరికైతే సర్వీస్ అవసరమో వారికి సర్వీస్‌ని అందిస్తాను, అదీ నేను చేయవలసింది.

## ఒబ్లయిజింగ్ నేచర్

**ప్రశ్నకర్త :** నేను నా దృష్టిలో చెప్తాను. ఒక కుక్క ఒక పావురాన్ని చంపుతుంటే దాన్ని రక్షించటానికి మనం వెళ్తే, నా దృష్టిలో అది ఒబ్లయిజ్ చెయ్యటమే కాని, అది వ్యవస్థిత మధ్య కలుగజేసుకున్నట్లవుతుంది కదా.

**దాదాశ్రీ :** అది ఒబ్లయిజ్ ఎప్పుడౌతుంది? అది వ్యవస్థితకు అనుకూలమైతే. లేకపోతే లేదు. మనం ఒబ్లయిజింగ్ నేచర్ కలిగివుండాలి. దానివలన పుణ్యం సంపాదిస్తాం. దానితో దు:ఖం ఉత్పన్నమయే సాధనమే లేకుండా పోతుంది. డబ్బులు లేకపోతే, తిరిగి చేయి, లేదా బుద్ధిని ఉపయోగించి, లేదా వాళ్ళకి అర్థమయ్యేట్లు చెప్పి, అలా ఏ మార్గాన్ని అనుసరించైనా సరే ఒబ్లయిజ్ చెయ్యి.

## పరోపకారంతో పరిణామంలో కూడా లాభం

ఈ లైఫు పరోపకారంలో గడిచినట్లయితే మీకు ఎందులోనూ లోపం ఉండదు. ఏ విధమైన కష్టాలు కలుగవు. మీ కోరికలు ఏమేం ఉన్నా, అవన్నీ పూర్తవుతాయి కానీ, ఇలా గంతులు వేస్తుంటే మాత్రం ఒక్క కోరిక కూడా నెరవేరదు. ఎందుకంటే ఈ విధానం మీకు నిద్ర కూడా పట్టనివ్వదు. సేఠులు (వ్యాపారస్తులకు) నిద్ర కూడా రాదు. 3, 4 రోజులు నిద్రపోరు. ఎందుకంటే ఎవరో ఒకరిని దోపిడీకి గురిచేసేవుంటారు.

అందువలన ఒబ్లయిజింగ్ నేచర్ ఉండాలి. పోస్ట్ ఆఫీస్‌కి పోతూ పోతూ, చుట్టుపక్కల వాళ్ళని, "అన్నా, పోస్ట్ ఆఫీసు పోతున్నా. మీకుగాని ఉత్తరాలు పోస్ట్ చేసే పనేమైనా ఉందా?" అని అడగవచ్చు. అలా అడిగి వెళ్తే నష్టమేమిటి? మీమీద నమ్మకం లేదని ఎవరైనా అన్నారనుకోండి, కాళ్ళు మొక్కుతా అయ్యా అనండి. ఎవరికైతే మీమీద నమ్మకం ఉందో వాళ్ళవైతే తీసుకెళ్ళండి.

నా చిన్నతనం నుండి ఉన్న గుణం, ఒబ్లయిజింగ్ నేచర్. 25 సంవత్సరాల వయసులో ఉన్నపుడు నన్ను నా ఫ్రెండ్స్ సర్కిల్ అంతా సూపర్ హ్యూమన్ అనేవారు.

హ్యూమన్ ఎవరంటే ఇచ్చిపుచ్చుకోవటాలు రెండిటినీ సమభావంతో చేసేవాడు. సుఖాన్నిచ్చినవారికి సౌఖ్యాన్నివ్వు, దుఖాన్నిచ్చినవారికి దుఖాన్నివ్వకు. అలా అన్ని పనులనూ చేసినవారిని మానవత్వం కలిగినవారంటారు.

అందువలన, ఎదుటివారినుండి సుఖాన్ని అందుకున్నవాడు బంధంలోకి పోతాడు. తనే ఇతరులకు సుఖాన్నిచ్చి తాను తిరిగి పొందినవాడు మానవీయ వ్యవహారం చేసినవాడౌతాడు, మనుషులలోకి వస్తాడు. తన సౌఖ్యాన్ని ఇతరులకు ఇచ్చినవాడు దేవగతిని పొందుతాడు- సూపర్ హ్యూమన్. తనకున్న సౌఖ్యాలను మరెవరైనా కష్టాలలో ఉన్నవారికి ఇచ్చినవాడు దేవగతిలో పయనిస్తాడు.

## అందులో ఇగోయిజమ్ నార్మల్

**ప్రశ్నకర్త :** పరోపకారంతో 'ఇగోయిజమ్' ఎందుకు పెరుగుతుంది?

**దాదాశ్రీ :** పరోపకారం చేసిన వ్యక్తి 'ఇగోయిజమ్' ఎప్పుడూ నార్మల్‌గానే ఉంటుంది. ఆ వ్యక్తి ఇగోయిజమ్ వాస్తవికరూపంలో ఉంటుంది కానీ, కోర్టులో నూటయాభై రూపాయలు ఫీజుగా తీసుకుని ఇతరుల పనిచేసినవారి 'ఇగోయిజమ్' చాల ఎక్కువగా ఉంటుంది.

ఈ ప్రపంచంలో ఉన్న నియమం ఏమిటంటే, మీరు మీ ఫలాలను ఇతరులకు ఇస్తే, ప్రకృతి మీ అవసరాలను చూసుకుంటుంది. ఇదే గుప్తంగా ఉన్న సైన్స్. ఇది పరోక్ష ధర్మం. ఆ తర్వాత ప్రత్యక్ష ధర్మం వస్తుంది, చివరకు ఆత్మ ధర్మం వస్తుంది. మనిషి జీవితంలో పద్దు ఇంతే. మనోవాక్కాయకర్మలను ఇతరుల కోసం ఉపయోగించు అన్నది నియమం.

## ఈ రోజు కొత్త ధ్యేయం, పాతవాటికి రియాక్షన్

**ప్రశ్నకర్త :** అంటే, పరోపకారం కోసమే జీవించాలా?

**దాదాశ్రీ :** ఔను పరోపకారం కోసమే జీవించాలి. అయితే ఇలా ఒక్కసారిగా మీరు లైన్ మార్చేస్తే, పాత రియాక్షన్‌లు ముందుకు వస్తాయి, మీరేమో, "ఇప్పటికీ వీటిని సహించాల్సి వస్తోందే" అని బాధపడతారు. కాని, కొంతకాలం సహించక తప్పదు. ఆ తర్వాత మీకు ఎలాంటి కష్టాలుండవు. కానీ ఇప్పుడు కొత్త మార్గంలో లైన్ తయారు చేస్తున్నావు కనుక, పాత రియాక్షన్‌లైతే వస్తాయి. ఇప్పటి వరకు మీరు తప్పు చేస్తూవచ్చినందుకు ఆ ఫలితాలైతే వస్తాయి కదా?

## చివరకు మీకు మీరు కూడా ఉపకారం చేసుకోండి

ఎప్పుడైనా ఎవరికైనా ఉపకారం చేసినట్లయితే, ఎవరికైనా లాభాన్ని చేకూర్చినట్లయితే, ఎవరి కోసమైనా జీవించినట్లయితే, మీకు అంత సొంత లాభం కూడా చేకూరుతుంది. కాని అది భౌతిక లాభమౌతుంది. అది భౌతిక ఫలాన్నిస్తుంది.

**ప్రశ్నకర్త :** ఎవరికైనా ఉపకారం చేసే బదులు మనకు మనం ఉపకారం చేసుకుంటే?

**దాదాశ్రీ :** అదే, అలా మనకు మనం ఉపకారం చేసుకునేందుకే ఇదంతా చేసేది. మనకు మనం ఉపకారం చేసుకుంటే, శుభమే జరుగుతుంది. కాని, దాని కోసం ముందుగా మనమెవరో మనం తెలుసుకోవాలి. అప్పటి వరకు

ఇతరులకు ఉపకారం చేస్తుండండి. అయితే దానికి భౌతిక ఫలం లభిస్తుంటుంది. మిమ్మల్ని మీరు తెలుసుకోవటానికి, "నేనెవరు?" అన్నది తెలుసుకోవాలి. నిజానికి మనం శుద్ధాత్మ. ఇప్పటి వరకు మీరు "నేను చందూ భాయ్‌ని" అనే తెలుసుకునివున్నారు కదా, లేక మరెమైనా తెలుసా? "నేను చందూ భాయ్‌ని" అంటారు మీరు. 'ఈమె భర్తని, ఇతని మామని, ఇతని బాబాయిని' ఇవన్నీ శృంఖలాలు. అంతేకదా. మీకున్న జ్ఞానం ఇదే కదా. దాన్ని దాటి పోలేదుగా మీరు?

## మానవ సేవ, సామాజిక ధర్మం

**ప్రశ్నకర్త :** కాని నిజానికి వ్యావహారికంగా దయా భావం, సేవా భావం ఉంటాయి కదా. ఎవరిపట్లనైనా ప్రేమబంధం ఉంటుంది, వారి కోసం "ఏమైనా చెయ్యాలి" అని ఉంటుంది కదా. ఎవర్కైనా ఉద్యోగం ఇప్పించటం, వ్యాధిగ్రస్తునికి హాస్పిటల్‌లో జాగా ఇప్పించటం, ఇలాంటివన్నీ ఒకరకంగా వ్యవహార ధర్మమే ఔతాయి కదా!

**దాదాశ్రీ :** అవన్నీ సామాన్య కర్తవ్యాలు.

**ప్రశ్నకర్త :** అయితే మానవసేవ కూడా వ్యావహారికమే అవుతుంది అనే అనుకోవాలి కదా. అదే వ్యవహార ధర్మమైంది కదా.

**దాదాశ్రీ :** అది వ్యవహార ధర్మం కాదు, సామాజిక ధర్మం. మీకు అనుకూలమైన సమాజంలోని సమాజ సభ్యులకు అది అనుకూలంగా ఉంటుంది కాని, అదే సేవ మీరు మరో సమాజానికి ఇవ్వటానికి సిద్ధమైతే అది ప్రతికూలమౌతుంది. అంటే, వ్యవహార ధర్మమంటే ఏమిటంటే, అందరికీ ఒకేలా అనిపించాలి. ఇప్పటివరకు మీరు చేసిందాన్ని సమాజసేవ అనవచ్చు. ప్రతివారికీ సమాజం వేరువేరుగా ఉంటుంది కనుక, సేవ కూడా భిన్నంగానే ఉంటుంది.

## లోకసేవ బిగిన్స్ ఫ్రమ్ హోమ్

**ప్రశ్నకర్త :** లోకసేవలోకి వచ్చినవారు ఎందుకోసం వచ్చివుంటారు?

**దాదాశ్రీ :** అది ఒక మంచి భావన. లోకులకు ఏవిధంగా మంచి జరుగుతుంది అన్నది అతని ఇచ్ఛ. మనోభావన మంచిదైతేనే.

ఇతరుల మీద ఉండే భావన-మనోభావన లో వాళ్ళకి ఎలాంటి దు:ఖం కలుగకూడదని ఉండాలి. అది ఎంతో గొప్ప భావన కదా. కానీ లోక సేవ చేసేవాళ్ళలో నేను వాళ్ళ ఇళ్ళకి వెళ్ళి చూస్తే వాళ్ళకి వెనక నుంచి పొగ వస్తుంటుంది. అది సేవ అవదప్పుడు. సేవాకార్యక్రమం మొదలవాల్సింది ఇంటి నుంచే. బిగిన్స్ ఫ్రమ్ హోమ్. ఆ తర్వాత నైబర్స్ (చుట్టుపక్కల వారు). ఆ తర్వాత ఇంకా ముందుకి వెళ్ళి చేయాలి సేవ. వీళ్ళ ఇంటికి వెళ్ళి అడిగితే వెనక నుంచి పొగ వస్తుంటుంది. అప్పుడు మీకెలా అనిపిస్తుంది? అందుకే ప్రారంభించాల్సింది ఇంటి నుంచే.

**ప్రశ్నకర్త :** ఈ అన్న అనేదేమిటంటే, ఇతని కేసులో ఇంట్లో పొగేమీ లేదు అని.

**దాదాశ్రీ :** అంటే దానర్థం అది నిజమైన సేవ అని.

## జనతా సేవను నిజాయితీగా చెయ్యి

**ప్రశ్నకర్త :** లోకసేవ చేస్తూ చేస్తూ, అందులో భగవద్దర్శనం చేసుకుంటూ సేవ చేస్తుంటే అది నిజమైన ఫలితాన్నిస్తుంది కదా.

**దాదాశ్రీ :** భగవంతుని దర్శనమయినట్లయితే ఇక లోకసేవలో ఎవరూ పడరు. ఎందుకంటే, భగవంతుని దర్శనమైన తర్వాత భగవంతుడిని ఎవరు వదిలిపెడతారు? ఈ జనతా సేవ చేసేదే జనార్దనుని పొందేందుకే. జనతా సేవను హృదయపూర్వకంగా చేయాలి. హృదయపూర్వకంగా చేస్తే అది అన్ని

చోట్లకు చేరుతుంది. లోకసేవతో పాటు ప్రఖ్యాతి లభిస్తుంటే మనిషిని ఇరకాటంలో పడేస్తుంది. ఖ్యాతి లేకుండా లోకసేవ చేస్తే అది సత్యమైనది. ఖ్యాతి ఎలాగూ వస్తుంది. కానీ ఖ్యాతి మీద ఇచ్ఛ ఉండగూడదు. అలా ఉండాలి.

జనతాసేవ చేసేవారు కారు ఈ మనుషులు. లోపల కీర్తి కాంక్ష ఉంటుంది. మానసికంగా లోభం కలుగుతుంది. ఎన్నో రకాల లోభాలున్నాయి. అవి చేయిస్తుంటాయి. జనతాసేవ చేసేవాళ్ళు ఎలా ఉంటారు? అపరిగ్రహం చేసేవారైవుంటారు. వీరంతా పేరు తెచ్చుకోవటానికే చేస్తుంటారు. "ఏదో ఒక రోజు మంత్రినవుతాను" అనే ఆలోచనతో సేవ చేస్తుంటారు. మనసులో ఉండేది దొంగ నిజాయితీ కనుకనే బయట కష్టాలు. పని చేయకుండానే పరిగ్రహణం. అలాంటి పనులను మానేస్తే, అంతా చక్కబడుతుంది. ఒక పక్క పరిగ్రహణం, సంపూర్ణ పరిగ్రహణం జరగాలి, రెండవ పక్క జనతా సేవ చెయ్యాలి. ఈ రెండూ ఎలా సాధ్యం?

**ప్రశ్నకర్త :** నేను మానవ సేవ చేస్తుంటాను. ఇంటింటికీ తిరిగి అడిగి తీసుకుని బీదలకు పంచుతుంటాను. ప్రస్తుతం ఇంతే చేస్తున్నాను.

**దాదాశ్రీ :** అదంతా మీ ఖాతాలో, బైఖాతాలో జమ అవుతుంటుంది. మీరు ఇస్తున్నది... కాదు కాదు మీరు మధ్యలో ఉండి చేస్తున్నదానికి మీకు లాభం కలుగుతుంది. పదకొండు రెట్లు సొమ్ము, దాని మీద కమిషన్ మీకు వస్తుంది. ఆ తర్వాత భావంలో కూడా మీకు కమిషన్ లభిస్తుంది, దాని వలన మనశ్శాంతి లభిస్తుంది. ఈ పనిని బాగా చేస్తుండబట్టి శాంతిగా ఉంటుంది. అలాగే భవిష్యత్తులో కూడా ఉంటుంది. ఇది చాల మంచి పని.

ఇక సేవ అనేది ఆయన పేరుతో చేస్తే నాకు కూడా తెలియగూడదు. అదే సేవ అంటే. మౌనంగా చేసే సేవ. బయటకు తెలిసిందంటే అది సేవ అనిపించుకోదు.

మేము ఒకసారి సూరత్‌లో ఒక గ్రామానికి వెళ్ళాం. ఒకతను, “నేను సమాజసేవ చేస్తాను” అన్నాడు. నేను అతన్ని, “ఏం సమాజసేవ చేస్తావు?” అని అడిగాను. దానికి అతను, “సేఠ్‌ల దగ్గరి నుంచి తీసుకుని ప్రజలకు పంచుతాను” అన్నాడు. నేను అతన్ని, “పంచిన తర్వాత ఆ సొమ్మును ఎలా ఖర్చు పెడుతున్నారో తెలుసుకున్నారా?” అని అడిగాను. దానికి అతను, “దాన్ని చూడాల్సిన అవసరం ఏముంది?” అన్నాడు. అప్పుడు అతనికి ఇలా చెప్పాను– బాబూ, నేను నీకు మార్గాన్ని చూపిస్తాను, ఇలా చెయ్యి అని. సేఠ్‌ల దగ్గరి నుండి డబ్బు తీసుకునివస్తున్నట్లయితే అందులో వాళ్ళకి వంద రూపాయలు పెట్టి ఒక తోపుడు బండి కొనివ్వు. చేత్తో తోసేది ఉంటుంది కదా రెండు చక్రాలది అది. వంద, నూటయాభై, రెండు వందల రూపాయలతో బండి ఇప్పించి, యాభై రూపాయలు ఆ పైన అదనంగా ఇచ్చి, “నువ్వు కూరగాయలు తీసుకునివచ్చి అమ్ము. ప్రతిరోజు సాయంత్రం నాకు ఆ పెట్టుబడి డబ్బుని తిరిగివ్వు. లాభం నీదే. ఇప్పించిన బండికి రోజుకింతని తీర్చేస్తుండు” అని చెప్పు అంటే అతను, “చాల బావుంది, చాల బావుంది ఇది. మీరు మరోసారి సూరత్ వచ్చేసరికి యాభై వందమంది మనుషులను తయారుచేస్తాను” అన్నాడు. అయితే ఆ పని చెయ్యి. ఈ బీదవాళ్ళందరికీ ఇప్పుడే బండ్లు ఇప్పించు. వాళ్ళు ఇంకా పెద్ద వ్యాపారం చేయవలసిన అవసరం ఉందా? ఒక బండి ఇప్పిస్తే రోజుకి ఇరవై రూపాయలు సంపాదిస్తారు. అదెలా అనిపిస్తుంది మీకు? అలా చేస్తే మనం పక్కా జైనులం అవునా కాదా? ఇది ఎలా ఉంటుందంటే, అగర్‌బత్తీ కాలిపోతూ సువాసనను వెదజల్లుతుంటుంది, కదా! రూమునంతా సువాసనతో నింపుతుంది. మనవలన కూడా సువాసన వ్యాపిస్తుందా లేదా?

మనం ఎందుకలా చెయ్యాలి? నేను ఇరవై ఐదు, ముప్పై సంవత్సరాల వయసులో కూడా అహంకారంతో ఉండేవాడిని, ఒక విచిత్రమైన అహంకార భావన. ఈ వ్యక్తి నన్ను కలిసిన తర్వాత కూడా ఇతనికి లాభం చేకూరకపోతే

ఇతను నన్ను కలిసి ఏం లాభం? దానివలన ప్రతి ఒక్కరికీ నావలన లాభం కలిగింది. నన్ను కలిసిన తర్వాత అతనికి లాభం కలుగకపోతే ఎందుకు? మామిడి చెట్టు ఏమంటుంది, నా దగ్గరకు వచ్చి, అది పండ్లు వచ్చే సీజన్ అయినట్లయితే, ఆ వచ్చినవాడికి ఎటువంటి లాభం కలుగనట్లయితే నేను మామిడిచెట్టునే కాను అని. చిన్నదైనా సరే, నీకు సరి అనిపించినట్లే కాని, దానివలన లాభమైతే ఉంటుంది కదా. మామిడి చెట్టుకి ఎటువంటి లాభం ఉండదు. అలాంటి ఆలోచనలుండాలి. అటువంటి మానవత్వం ఉండాలి. ఇలా విడమరిచి చెప్తే అందరికీ అర్థమౌతుంది. అతనికైతే అర్థమైంది, అతను ఆ పని చేసాడు, ఇక బండి ముందుకు నడిచింది. మీకు ఏమనిపిస్తుంది?

**ప్రశ్నకర్త :** మీరన్న ఆ గొప్ప వ్యక్తి సంస్థ అన్నిచోట్లా ఉంది.

**దాదాశ్రీ :** కాని, అతనిప్పుడు కష్టాల్లో చిక్కుకున్నాడు కదా! అందులో ఎవరి తప్పు లేదు. అయిందేదో అయిపోయింది. ఇప్పుడు అలాంటి ఆలోచనలనుంచి బైటపడాలి. ఇప్పటికీ బాగుపడే అవకాశం ఉంది. చెడిపోయినవాడిని బాగుచేయటమే ధర్మం. బాగున్నవాడినే బాగుచేయటానికి ముందుకొస్తారంతా. కాని చెడినవాడిని బాగు చెయ్యండి. అదే ధర్మమంటే.

## మానవ సేవే ప్రభు సేవ

**ప్రశ్నకర్త :** మానవ సేవే ప్రభు సేవ కదా!

**దాదాశ్రీ :** కాదు ప్రభుసేవ కాదు. ఇతరులకు సేవ ఎప్పుడు చేస్తారు? మీకు లోలోపల దుఃఖం కలుగుతుంది. మీకు ఏ మనిషి మీదైనా దయ కలిగితే, అతని స్థితిన చూసినప్పుడు మీకు లోలోపల దు:ఖం కలుగుతుంది. ఆ దుఃఖాన్ని పోగొట్టుకోవటానికే ఈ సేవలన్నీ చేస్తారు. అంటే ఇదంతా మీలోపలున్న దుఃఖాన్ని పొగట్టుకోవటానికే. ఒక మనిషికి ఎంతో దయ కలుగుతుంది అనుకో.

అతనేమంటాడు, నాకు దయ కలగటం వలన వీళ్ళకి అది ఇచ్చేసాను, ఇది ఇచ్చేసాను అంటాడు. అరె, కాదు. నీ దు:ఖాన్ని పోగొట్టుకోవటం కోసమే ఇతరులకు ఇస్తుంటావు. మీకు అర్థమైందా ఈ విషయం? చాల లోతైన విషయమిది. పై పై మాటలు కావు. నీ సొంత బాధను పోగొట్టుకోవటం కోసమే ఇస్తుంటావు. అయినా అది మంచి పనే. ఎవరికైనా ఇస్తే, ఆ తర్వాత నువ్వు దాన్ని పొందుతావు.

**ప్రశ్నకర్త :** కానీ జనతా జనార్దన్ సేవ అదే భగవంతుని సేవ కదా. లేకపోతే నిరాకారునికి ఆకారాన్నిచ్చి పూజించటమా?

**దాదాశ్రీ :** జనతా జనార్దన్ సేవ చేసినట్లయితే మనకు ప్రపంచంలోని సర్వసుఖాలూ లభిస్తాయి– భౌతిక సుఖాలు. నెమ్మది నెమ్మదిగా, అంచెలంచలుగా, మోక్షం వైపు వెళ్తారు. కానీ, ప్రతి సందర్భంలోను అలా జరగాలని లేదు. ఏదైనా ఒక సందర్భంలో అనుకోకుండా జరుగుతుంది. అన్ని సందర్భాలలో అలా జరగదు. కనుక అది ఒక సిద్ధాంత స్వరూపం కాదు.

## ....కళ్యాణ కార్యంలో భిన్న శ్రేణులు

సమాజ కళ్యాణం చేసేవాళ్ళంతా జగత్‌కళ్యాణం చేసనట్లు కాదు. అది ఒక ప్రాపంచిక భావం. వాటిని సమాజ కళ్యాణం అంటారు. అది ఎవరికి ఎంత వీలవుతుందో అంత చేస్తారు. అది స్థూలమైన భాష. జగత్కళ్యాణం సూక్ష్మ భాష, సూక్ష్మతర, సూక్ష్మతమ భాష. ఒక సూక్ష్మతమ భావమే ఉంటుంది లేదా దాని తుంపరలే ఉంటాయి.

## సమాజ సేవ అనేది ప్రకృతి స్వభావం

సమాజసేవ చేసే భారాన్ని ఎత్తుకున్నవాడు, అంటే ఇంట్లో పెద్దగా ధ్యాస పెట్టకుండా, బయటివారి సేవలోనే ఉంటే, దాన్ని సమాజసేవ అంటారు.

మిగతావన్నీ వారివారి అంతరంగ భావాలు మాత్రమే. అలాంటి భావాలు ఎవరికైనా వస్తూనేవుంటాయి. ఎవరి మీదైనా దయ కలగటం, లేక మమకారం కలగటం మొదలైనవి. అలాంటివన్నీ అందరూ ప్రకృతి నుంచి తీసుకునే వచ్చారు. అదంతా ప్రకృతి ధర్మమే. సమాజసేవ కూడా ప్రకృతి ధర్మమే. దాన్ని ప్రకృతి స్వభావం అంటారు– ఇతని స్వభావం ఇది, అతని స్వభావం అది అని. కొందరి స్వభావం దుఃఖాన్ని కలిగించేదైయ్యుంటుంది, కొందరి స్వభావం సుఖాన్నిచ్చేదైయ్యుంటుంది. ఈ ఇద్దరి స్వభావాలనూ ప్రాకృతిక స్వభావాలు అంటారు, ఆత్మ స్వభావం కాదు. ప్రకృతి దేనితోనైతే నింపిందో, అదే వారి నుండి బయటకు వస్తుంది.

## సేవ- కుసేవ, ప్రాకృతిక స్వభావం

మీరు చేసే ఈ సేవ ప్రకృతి స్వభావం. ఎవరైనా వ్యక్తి కుసేవ చేస్తే అదీ ప్రకృతి స్వభావమే. ఇందులో మీ పురుషార్థమేమీ లేదు, వాళ్ళ పురుషార్థమూ ఏమీ లేదు. కానీ మనసులో మన భావన, "నేను చేస్తున్నాను" అని ఉంటుంది. "నేను చేస్తున్నాను" అనేదే భ్రాంతి. ఇక్కడ ఈ జ్ఞానాన్ని అందించిన తర్వాత కూడా మీరు సేవ చేస్తునేవుంటారు. ఎందుకంటే అటువంటి ప్రకృతిని వెంట తీసుకునివచ్చారు మీరు. కానీ ఆ సేవ శుద్ధ సేవ అవుతుంది. ఇప్పుడు శుభ సేవ జరుగుతూవుంది. శుభ సేవ అంటే బంధంలో ఉన్న సేవ, బంగారు సంకెళ్ళు, కానీ అదీ బంధమే కదా. ఈ జ్ఞానం పొందిన తర్వాత, ఎదుటి మనిషి ఎలా ఉన్నా మీకు దుఃఖమనేది కలుగదు, అతని దుఃఖం దూరమౌతుంది. ఆ తర్వాత మీలో కరుణ ఉంటుంది. ఇప్పుడు మీకున్నది దయ, అయ్యో పాపం అతనికి ఎంత బాధ కలుగుతూవుందో, ఎంత బాధ కలుగుతూవుందో అని. అతని మీద మీకు దయ కలుగుతుంది. దయ ఎప్పుడైనా మీకు దుఃఖాన్ని కలిగిస్తుంది. దయ ఉన్నచోట అహంకారం కూడా ఉంటుంది. దయ అనేది

లేకుండా ప్రకృతి సేవ చేయటం జరగదు. ఈ జ్ఞానం తర్వాత మీలో ఉండేది కరుణా భావన.

సేవాభావం ఫలితం భౌతిక సుఖాలు, కుసేవ ఫలితం భౌతిక దు:ఖాలు. సేవాభావంలో మీలోని "నేను" అనేది ఎరుకలోకి రాదు. "నేను" అనేది ఎరుకలోకి రానంతవరకు ఒబ్లయిజింగ్ నేచర్ కలిగివుండండి.

## నిజమైన సమాజ సేవకుడు

మీరు ఎవరికి సహాయంచేస్తారు?

**ప్రశ్నకర్త :** సమాజసేవలో నేను చాల సమయాన్ని వెచ్చిస్తాను.

**దాదాశ్రీ :** సమాజసేవ ఎన్నో రకాలుగా ఉంటుంది. ఏ సమాజసేవలో... ఎందులో కొంచెం కూడా "సమాజసేవకుడను" అనే ధ్యాస ఉండదో, అదే వాస్తవికమైన సమాజసేవ.

**ప్రశ్నకర్త :** ఇది నిజం.

**దాదాశ్రీ :** ఇక మిగతా సమాజసేవకులు అన్నిచోట్లలోను ప్రతి విభాగంలోను ఇద్దరు ముగ్గురుంటారు. తెల్లని టోపీ పెట్టుకుని తిరుగుతుంటారు, సమాజసేవకుడిని అంటూ. కాని వాళ్ళు ఆ భావాన్ని వదిలేస్తే వాళ్ళు నిజమైన సేవకులౌతారు.

**ప్రశ్నకర్త :** ఏదైనా మంచి పని చేస్తే లోపల అహం వచ్చేస్తుంది, నేను చేసాను అని.

**దాదాశ్రీ :** అది వస్తుంది.

**ప్రశ్నకర్త :** మరి దాన్ని మర్చిపోవటానికి ఏం చెయ్యాలి?

**దాదాశ్రీ :** కాని, ఈ నేను సమాజసేవకుడిని అనే అహంకారం రానేగూడదు. మంచి చేసినపుడు అహంకారం వస్తుంది కాని, మీ ఇష్టదేవత లేక మీరు నమ్మే భగవంతుని తలచుకుని, "హే భగవాన్, నాలో అహంకారం రాగూడదు కాని వచ్చేస్తోంది. నన్ను క్షమించు" అని చెప్పుకోవాలి అంతే. ఈ మాత్రం చెయ్యటం అవుతుంది కదా!

**ప్రశ్నకర్త :** ఔతుంది.

**దాదాశ్రీ :** అంత చేస్తే చాలు.

సమాజసేవకి అర్థం ఏమిటి? అది నేను అనే భావాన్ని చాలవరకు తొలగిస్తుంది. "నేను" అనేది సంపూర్ణంగా సమాప్తమైనట్లయితే మీరు పరమాత్మే. ఇక అతనికి సుఖమన్నది కలగటమే ఉండదు.

## సేవలో అహంకారం

**ప్రశ్నకర్త :** అంటే, ఈ జగత్తులో మనం ఏం చెయ్యాల్సిన పనే లేదా?

**దాదాశ్రీ :** మీరు చేసేదేమీ లేదు. అక్కడే అహంకారం కలుగుతుంది. ఈ మనుషులే అహంకారంలో ఉంటారు కర్తృత్వ భావనతో.

**ప్రశ్నకర్త :** ఈ సోదరీమణి ఒక డాక్టరు. ఒక పేద రోగి వచ్చాడు. అతని మీద అనుకంపన కలిగి సుశ్రూష చేస్తుంది. మీరు చెప్పినదాన్నిబట్టి అనుకంపన కలిగే అవకాశమే ఉండగూడదు.

**దాదాశ్రీ :** ఆ అనుకంపన ప్రాకృతికమైనది. కానీ నాకు అటువంటి అనుకంపన కలిగింది అంటూ అహంకారంలోకి వెళ్తారు. అహంకారం లేకపోతే ఏం పరవాలేదు. కానీ అహంకారమనేది లేకుండా ఉండరు కదా!

## సేవలో సమర్పణా భావం

**ప్రశ్నకర్త :** ఈ ప్రపంచంలో, సేవలోనే పరమాత్మ సేవ అనే భావంతో చేస్తే అది బాధ్యతలోకి వస్తుంది కదా?

**దాదాశ్రీ :** ఔను. దాని ఫలితంగా పుణ్యం వస్తుంది కాని మోక్షం రాదు.

**ప్రశ్నకర్త :** ఆ పనిని సాక్షాత్తూ పరమాత్మకి అంకితం చేస్తే కూడా మోక్షం కలుగదా?

**దాదాశ్రీ :** అటువంటి ఫలితాలను ఎవరికీ ఇవ్వటం సాధ్యపడదు.

**ప్రశ్నకర్త :** మానసిక సమర్పణ చేస్తే?

**దాదాశ్రీ :** అలా సమర్పించినా, ఎవరూ తమ ఫలితాలను ఇవ్వటం కాని, తీసుకోవటం కాని జరగదు. అది కేవలం మాటల్లోనే. నిజమైన ధర్మం "జ్ఞాని పురుష్" ప్రదానం చేసిన తర్వాతనే తనంతట తానుగా నడుస్తుంటుంది. వ్యవహార ధర్మమైతే మనం చెయ్యాల్సివుంటుంది. దాన్ని నేర్చుకోవలసివుంటుంది.

## బైప్రొడక్షన్‌లో భౌతిక సమృద్ధి

**ప్రశ్నకర్త :** భౌతికి సమృద్ధిని పొందాలనే ఇచ్ఛ, అందుకు ప్రయత్నాలు, ఆధ్యాత్మిక వికాసానికి అవరోధాలౌతాయా?

**దాదాశ్రీ :** భౌతిక సమృద్ధి కోసం మనం ఈ దిశలో వెళ్ళాలి, ఆధ్యాత్మిక సమృద్ధి కోసం ఈ రెండవ దిశలో వెళ్ళాలి. మనం ఒక దిశలో వెళ్ళాలి కాని, రెండవ దిశలో వెళ్తే అవరోధాలు కలుగుతాయి కదా?

**ప్రశ్నకర్త :** ఔను వాటిని అవరోధాలు అనవచ్చు.

**దాదాశ్రీ :** అంటే, సంపూర్ణ అవరోధమే. ఆధ్యాత్మికం ఈ దిశలో ఉంటే, భౌతికం దాని ఎదుటి దిశలో ఉంటుంది.

**ప్రశ్నకర్త :** కానీ, భౌతికి సమృద్ధి లేకుండా ఎలా నడుస్తుంది?

**దాదాశ్రీ :** భౌతిక సమృద్ధిని ఈ ప్రపంచంలో ఎవరైనా పొందివున్నారా? అందరూ భౌతిక సమృద్ధి వెనక పడ్డారు. ఎవరికైనా పూర్తయిందా?

**ప్రశ్నకర్త :** కొంతమందికే అవుతుంది. అందరికీ కాదు.

**దాదాశ్రీ :** మనిషి చేతుల్లో లేదు ఆ అధికారం. అధికారం లేని చోట అనవసరంగా హడావిడి చేస్తున్నారంటే ఏమిటి దాని అర్థం? మీనింగ్‌లెస్.

**ప్రశ్నకర్త :** కోరిక ఏదైనా మిగిలివుంటే ఎవరైనా ఆధ్యాత్మికవైపు ఎలా వెళ్ళగలరు?

**దాదాశ్రీ :** ఔను కోరిక ఉంటుంది నిజమే. కోరికనేది ఉంటుంది కాని, మన వశంలో లేనిదది.

**ప్రశ్నకర్త :** ఆ కోరిక ఎలా తీరుతుంది మరి?

**దాదాశ్రీ :** అతని కోరిక మేరకు అంతా వచ్చేస్తుంది. దాని గురించి ఏం కష్టపడవలసిన అవసరం లేదు. ఆధ్యాత్మిక సాధన చేస్తుండు. భౌతిక సమృద్ధి అనేది అందులో బైప్రోడక్ట్. ఆధ్యాత్మిక ప్రొడక్షన్‌ని మీరు ప్రారంభించినట్లయితే, భౌతిక సమృద్ధి బైప్రోడక్ట్ మీకు ఫ్రీఆఫ్ కాస్ట్ లభిస్తుంది.

**ప్రశ్నకర్త :** ఆధ్యాత్మికత వైపు వెళ్ళటమంటే, మీరు చెప్పేదేమిటి? ఎలా వెళ్ళాలి?

**దాదాశ్రీ :** ముందుగా, ఆధ్యాత్మిక ప్రొడక్షన్ ప్రారంభిస్తే అందులో భౌతికం బై ప్రోడక్ట్ అన్న విషయం అర్థమైందా? ఈ విషయం మీకు అర్థమైందా?

**ప్రశ్నకర్త :** మీరు చెప్తే నేను ఒప్పుకుంటాను కాని, నాకు అర్థమైతే కాలేదు.

**దాదాశ్రీ :** అలా ఒప్పుకున్నా, ఇదంతా బైప్రోడక్టే అంటే ఫ్రీ ఆఫ్ కాస్ట్! ప్రపంచంలో వినాశకరమైన విలాసాలన్నీ ఫ్రీ ఆఫ్ కాస్ట్ లభిస్తాయి. ఆధ్యాత్మిక సుఖ ప్రాప్తి కోసం వెళ్తుంటే దారిలో ఈ బై ప్రోడక్ట్ లభిస్తుంది.

**ప్రశ్నకర్త :** నేను చాలమందిని చూసాను. వాళ్ళు ఆధ్యాత్మికంలోకి వెళ్ళలేదు. కాని భౌతికంగా సమృద్ధిని పొంది ఎంతో సుఖంగా ఉన్నారు.

**దాదాశ్రీ :** ఔను వాళ్ళు ఆధ్యాత్మికంగా వెళ్తున్నట్లు కనపడకపోవచ్చు కాని, వాళ్ళు ఆధ్యాత్మికంగా ఉన్నారు. దాని ఫలితమే అది.

**ప్రశ్నకర్త :** అంటే, ఈ జన్మలో ఆధ్యాత్మిక సాధన చేస్తే మరుజన్మలో భౌతిక సుఖం లభిస్తుందా?

**దాదాశ్రీ :** ఔను. దాని ఫలితం తర్వాత జన్మలో మీకు లభిస్తుంది. ఆ ఫలమేమిటో ఈ రోజే కనిపిస్తుంది మీకు, మీరు ఆధ్యాత్మికంలో లేకపోయినా.

## పని చేయటానికి కారణం సేవా, లేక లక్ష్మియా?

ఏ పని చేయటానికైనా కారణమంటూ ఒకటి ఉంటుంది– దేనికోసం ఆ పని చేస్తున్నారన్నది. అందులో ముఖ్యమైన కారణం పూర్తయినట్లయితే, అంటే, ఈ హాస్పిటల్‌ని కట్టించాలి అంటే, అందులో పేషెంట్లకు ఏ విధంగా ఆరోగ్యాన్ని చేకూర్చాలి, ఏ విధంగా వాళ్ళకి ఉపశమనం కలిగించాలి, ఏ విధంగా రోగులకు ఆనందాన్ని కలిగించాలి, ఏ విధంగా వాళ్ళలో శారీరక శక్తి పెరగాలి, ఇలాంటి ముఖ్యమైన కారణం పూర్తిచేసి, సేవాభావంతోనే పని సాగిస్తున్నట్లయితే, దాని బైప్రొడక్షన్ ఏమిటో తెలుసా? లక్ష్మి. చివరకు లక్ష్మి బైప్రొడక్ట్ అవుతుంది. అదే ప్రొడక్షన్ అనుకోవద్దు. ప్రపంచమంతా లక్ష్మియే ప్రొడక్షన్ అనే భావనలో ఉన్నారు. అందువలన బైప్రోడక్ట్ లాభం వాళ్ళకి అందటం లేదు.

అందువలన, మీరు కేవలం సేవాభావాన్నే పూర్తిచేసినట్లయితే, దాని బైప్రొడక్షన్‌లో లక్ష్మీ అధికంగా వస్తుంది. అంటే, లక్ష్మీని బైప్రోడక్ట్ కిందనే ఉంచినట్లయితే, లక్ష్మీ ఎక్కువగా వస్తుంది. కానీ లక్ష్మీ కోసమే ప్రయత్నం చేస్తున్నారు కనుక లక్ష్మి రాదు. అందువలన మీరు ఉద్దేశ్యం ఏం పెట్టుకోవాలో చెప్తున్నా, అది “నిరంతర సేవాభావం”. ఇక బైప్రోడక్ట్ తనంతటతానుగానే వచ్చేస్తుంది. బైప్రోడక్ట్ కోసం ఎటువంటి ప్రయత్నమూ చెయ్యనక్కర్లేదు, ఖర్చు కూడా అదనంగా ఏమీ పెట్టనక్కర్లేనట్లుగానే, అది ఫ్రీ ఆఫ్ కాస్ట్ అయినట్లుగానే, లక్ష్మీ కూడా ఫ్రీ ఆఫ్ కాస్ట్ లభిస్తుంది. మీకు అలాంటి లక్ష్మి కావాలా లేక ఆన్ (ఎక్కువ ధరకి అమ్మటం) వలన లభించే లక్ష్మి కావాలా? ఆన్ లక్ష్మీ వద్దా. అయితే శుభం. ఫ్రీ ఆఫ్ కాస్ట్ వస్తుంటే ఇక కావలసిందేముంది?

అందువలన, సేవాభావాన్ని సంపూర్ణం చేయి– మానవమాత్రుల సేవ! మనం హాస్పిటల్ నిర్మించామంటే మనం సంపాదించిన విద్యను సేవాభావంతో ఉపయోగించాలి. అదే మన ఉద్దేశ్యం అవాలి. దాని ఫలితంగా, ఇతర ప్రయోజనాలు ఫ్రీ ఆఫ్ కాస్ట్ లభిస్తాయి, డబ్బుకి ఎప్పుడూ కొదవుండదు. డబ్బు సంపాదించటం కోసమే ఆ పనికి వెళ్ళినవాళ్ళకి నష్టం వచ్చింది. డబ్బు కోసమే కార్ఖానా పెట్టారంటే ఆ ప్రొడక్ట్ ఉండదు కదా! ఎందుకంటే లక్ష్మి కేవలం బైప్రొడక్షన్‌లోని బైప్రోడక్ట్ మాత్రమే. అందువలన, మనం ప్రొడక్షన్‌ని సంపూర్ణం చేస్తేనే బైప్రోడక్ట్ ఫ్రీ ఆఫ్ కాస్ట్ లభిస్తుంది.

## లోక కళ్యాణమే ప్రొడక్షన్

ఆత్మ ప్రాప్తి కోసం ఏం చేసినా అది ప్రొడక్షనే, దాని కారణంగా బైప్రోడక్ట్ కూడా లభిస్తుంది, అన్ని ప్రాపంచిక అవసరాలూ తీరిపోతాయి. నేను ఒకే ఒక్క ప్రొడక్షన్‌ని చేపడతాను. “విశ్వమంతా పరమ శాంతిని పొంది, కొందరు మోక్షం పొందాలి”. నా ఈ ప్రొడక్షన్, దాని బైప్రోడక్షన్ నాకు లభిస్తూనేవుంటుంది.

మీకు తీరే దైనందిన అవసరాలు నాకు వేరే విధంగా తీరుతాయి. అందుకు కారణమేమిటి? మీతో పోలిస్తే నా ప్రొడక్షన్ ఉత్తమమైనది కనుక. మీ ప్రొడక్షన్ కూడా అలాగే ఉత్తమ స్థాయికి చేరుకుంటే, బైప్రోడక్ట్ కూడా అలాగే ఉత్తమ స్థాయిలో లభిస్తుంది. ప్రతి పనికి ఒక కారణముంటుంది. సేవాభావమే కారణమైతే, 'బైప్రోడక్ట్' గా లక్ష్మీ ప్రాప్తిస్తుంది.

## సేవ పరోక్షంగా భగవంతుని సేవే

మిగతా ప్రొడక్షన్ అంతా బైప్రోడక్ట్ అవుతుంది. అందులో మీకు అవసరమైనవన్నీ మీకు సమకూరుతాయి, ఈజీగా లభిస్తూపోతాయి. మరి చూడు డబ్బుల ప్రొడక్షన్ చేస్తే డబ్బు ఇప్పుడు ఈజీగా దొరకటంలేదు. ఉరుకులూ పరుగులు. ఇది చెయ్యనా అది చెయ్యనా అంటూ పరుగులు పెట్టటం, చూడటానికి ఆముదం రాసుకుని తిరుగుతున్న ముఖంతో తిరుగుతున్నట్లుంటుంది. ఇంట్లో తినటానికి, తాగటానికి మంచి వస్తువులే ఉన్నాయి, ఎన్నో సౌకర్యాలున్నాయి, వెళ్ళే దారి ఎంత బావుంది, ఆ దారిలో నడిస్తే కాళ్ళకి మట్టే అంటదు. అందువలన, మానవ సేవ చెయ్యి, మానవునిలో మాధవుడున్నాడు. భగవంతుడు లోపలే విరాజమానుడైవున్నాడు. భగవంతుడిని బయట వెతికితే ఆయన కనపడడు.

మీరు మనుషుల డాక్టర్ కాబట్టి మీకు మనుషులకు సేవ చేయమంటున్నాను. అదే జంతువుల డాక్టరైతే జంతువులకు సేవ చేయమని అనివుండేవాడిని. జంతువులలో కూడా దేవుడు విరాజమానుడైయ్యున్నాడు. కానీ ఈ మనుషులలో భగవంతుడు విశేష రూపంలో ప్రకటితమైయ్యున్నాడు.

## సేవ పరోపకారం తర్వాత మోక్షమార్గం

**ప్రశ్నకర్త :** మోక్షమార్గం సమాజసేవ కంటే గొప్పది ఎలా అవుతుంది? ఇది కాస్త చెప్పరూ?

**దాదాశ్రీ :** సమాజసేవకుని మీరెవరు అని అడిగితే, అతను సమాజ సేవకుడను అని అంటాడు. ఏమంటాడు? ఇదే కదా అంటాడు లేకపోతే మరేమైనా అంటాడా?

**ప్రశ్నకర్త :** అదే అంటాడు.

**దాదాశ్రీ :** అంటే, ''నేను సమాజసేవకుడను'' అనటం అనేది ఇగోయిజమ్. మరి ఈ వ్యక్తిని అడిగితే, "బైటకు నేను చందూభాయ్‌ని కాని, వాస్తవానికి నేను శుద్ధాత్మను" అంటాడు. కాబట్టి అది ఇగోయిజమ్ లేనిది. విదౌట్ ఇగోయిజమ్.

సమాజసేవకుని ఇగో (అహంకారం) మంచి పనికేలే కాని అది ఇగో. చెడ్డపనిలో ఇగో అయితే అది "రాక్షసత్వం" ఔతుంది. మంచి పనికోసం ఇగో ఉంటే, దేవుడు ఇలా అంటాడు, ''ఇగో అంటే ఇగో. ఇగో అంటే తిరుగాడుతుండటం, ఇగో చచ్చిపోతే, ఇక ఇక్కడే మోక్షం వస్తుంది.

## "నేనెవరు" అన్నది తెలుసుకోవటమే ధర్మం

**ప్రశ్నకర్త :** ప్రతి జీవి చెయ్యవలసిందేమిటి? అతని ధర్మమేమిటి?

**దాదాశ్రీ :** చేసేదంతా అతని ధర్మమే. కాని మనం, నా ధర్మం ఇంతే అని అంటాం. అందులో మనం ఇగోయిజంలోకి పోయి, ఇది నేను చేసాను అంటాం. కాబట్టి మనం ఇప్పుడు చెయ్యవలసిందేమిటి, కేవలం "నేనెవరిని" అన్నది తెలుసుకోవటమే, అందుకు ప్రయత్నం చేయటం, దానితో పజిల్ అంతా సాల్వ్ అయిపోతుంది. మళ్ళీ మీముందుకు పజిల్ రాదు. అలా పజిల్ మీకు ఎదురవకపోతే మీరు స్వతంత్రులు అవటం మొదలౌతుంది.

## లక్ష్మియే బైప్రొడక్షన్‌లో

**ప్రశ్నకర్త :** ప్రతి ఒక్కరికీ కర్తవ్యమనేది ఒకటి ఉంటుంది. వకీలైనా, డాక్టరైనా, కర్తవ్యం, "ఒక మనిషిగా మంచి పనులు చేస్తాను" ఇంతే కదా.

**దాదాశ్రీ :** ఔను. కానీ ఈ "మంచి పని" అనే ముడి వేసుకోకుండా మీ పనులు మీరు చేస్తూపోతుంటారు. ఎటువంటి డెసిషనూ తీసుకోరు. ఏ ఉద్దేశ్యమనేది లేకుండా బండిని ముందుకు నడుపుతుంటారు. ఏ ఊరెళ్ళాలి అన్నది తెలియదు. ఏ ఊళ్ళో ఆగాలి అన్నది కూడా తెలియదు. దార్లో ఎక్కడ టీ ఫలహారాలు సేవించాలి అదీ తెలియదు. కేవలం పరుగులు తీయటమే. అందుకే అంతా చిక్కుబడిపోయివుంది. దేనికోసం వెళ్ళాలి అన్నది నిర్ణయించుకున్న తర్వాతనే ఆ పనులన్నిటినీ చెయ్యటానికి పోవాలి.

మనం కేవలం ఉద్దేశ్యాన్ని మార్చుకోవాలి అంతే. మరేమీ చెయ్యనక్కర్లేదు. పంపు ఇంజిన్‌ని అటువైపు పెడితే నీళ్ళు వస్తుంటాయి. ఇటువైపు పెడితే బురద లోంచి బియ్యం పుట్టుకొస్తాయి. కేవలం ఇంజన్ పెట్టటంలోనే ఉంది తేడా అంతా. దేనికోసం చేస్తున్నామనే ఉద్దేశ్యాన్ని నిర్ణయించుకోవాలి, ఆ లక్ష్యంలోనే ఉండాలి. అంతే. మరేమీ లేదు. లక్ష్యంలో లక్ష్మి ఉండవలసిన అవసరమే లేదు.

## "స్వయం సేవ" లోనే ఉన్నది ధర్మమంతా

ధర్మాలు రెండు రకాలు. మూడో రకం ధర్మమనేదే లేదు. లోక సేవ ఉన్నది ఒక రకం ధర్మం. స్వయం (ఆత్మ) సేవ రెండవ రకం ధర్మం. స్వయం సేవ అనే హోమ్ డిపార్ట్‌మెంట్‌లో (ఆత్మ స్వరూపంలో) కి వెళ్ళి, లోక సేవ చేస్తే, ఆ వ్యక్తికి ప్రాపంచిక సౌఖ్యం లభిస్తుంది అంటే, భౌతిక లాభం కలుగుతుంది. ఎందులోనైతే జనతా సేవ అనేదే లేదో, ఎందులోనైతే స్వయం సేవ ఇమిడి లేదో, అదంతా ఒక రకమైన సామాజిక ఉపన్యాసమే. అలాంటివాళ్ళు తమకు తామే ఒక భయంకరమైన నిషాలోకి పోబోతున్నారు. ప్రపంచంలో ఎటువంటి

సేవా కార్యక్రమమైనా అది ధర్మమే. లోకసేవ కాకపోతే స్వయం సేవలో ఉండు. స్వయం సేవలో ఉన్నవారు, లోకసేవ కంటే ఉత్తమమైన స్థితిలో ఉన్నట్లే. ఎందుకంటే, స్వయం సేవలో ఎవరికీ బాధ కలిగించటం ఉండదు.

**ప్రశ్నకర్త :** కానీ, స్వయం సేవ చేసుకోవాలనేది బుర్రలో తట్టాలి కదా.

**దాదాశ్రీ :** అది తట్టటం అంత సులభం కాదు.

**ప్రశ్నకర్త :** వాళ్ళేం చెయ్యాలి మరి?

**దాదాశ్రీ :** స్వయం సేవలో ఉన్న జ్ఞాని పురుష్ని, "అయ్యా, మీరు ఇతరులకు సేవచేస్తారా, లేక స్వయం సేవలో ఉంటారా?" అని అడగాలి. అప్పుడు ఆ అయ్య, "మేము స్వయంసేవలో ఉన్నాము" అని అంటే, "నాకూ ఆ మార్గాన్ని చూపించండి" అని మనం అడగాలి.

## "స్వయం సేవ" లక్షణం

**ప్రశ్నకర్త :** స్వయం సేవ లక్షణాలు ఎలా ఉంటాయి?

**దాదాశ్రీ :** "స్వయం సేవ" అంటే ఎవరికీ దుఖం కలిగించకుండా ఉండటం, అది మొదటి లక్షణం. అందులో అన్నీ వచ్చేస్తాయి. అబ్రహ్మచర్య సేవనం కూడా చెయ్యడు. అబ్రహ్మచర్య సేవనమంటే ఇతరులకు దు:ఖం కలిగించటంతో సమానం. ఒకవేళ సమ్మతంతో అబ్రహ్మచారి అయ్యాడే అనుకో. అయినా ఎన్ని జీవాలు అందులో మరణిస్తాయి! అందువలన అది దు:ఖాన్ని కలిగించటమే అవుతుంది. దానివలన అతను చేసే సేవ ఆగిపోతుంది. ఇక అబద్ధమాడటం, దొంగతనం చేయటం, హింస, డబ్బు పోగుచేసుకోవటం ఉండవు. పరిగ్రహణం, డబ్బు పోగుచేసుకోవటం ఇవి హింసలోకే వస్తాయి. అలా ఇతరులకు దు:ఖాన్ని కలిగించటం జరుగుతుంది. అందులోకి అన్నీ వస్తాయి.

**ప్రశ్నకర్త :** స్వయం సేవలోని రెండవ లక్షణాలు ఏమేమిటి? స్వయం సేవ చేస్తున్నాడు. అది ఎలా చెప్పగలగుతాము?

**దాదాశ్రీ :** "స్వయంసేవ" లో ఉన్నవానికి ప్రపంచంలోని జనులందరూ దుఃఖాన్ని కలిగించనీ, అతను మాత్రం ఇతరులకు దుఃఖాన్ని కలిగించడు. దుఃఖాన్ని కలిగించకపోవటమే కాదు, వాళ్ళకేమైనా కీడు జరగాలి అనే చెడు భావనను కూడా మనసులోకి రానివ్వడు. "నీకు శుభం జరుగుగాక" అనే అంటాడు.

అయినా, ఎదుటివారు ఏమైనా అన్నా ఏం పరవాలేదు. ఎదుటివారు, నువ్వు ఏమీ చేతగానివాడివి, దుర్మార్గుడివి, బాధపెట్టేవాడివి, ఇలా అన్నా ఏం పరవాలేదు. మనం ఏం చేస్తున్నాం అన్నదే గమనించుకోవాలి. ఎదుటివాడు రేడియోలోలా మాట్లాడుతూనేవుంటాడు, రేడియో మోగుతుందే అలా.

**ప్రశ్నకర్త :** ప్రపంచంలోని వారంతా మనకు దుఃఖాన్ని కలిగించినా మనం దాన్ని సహించి ఊరుకోవటమనేది జరగని పని. ఇంట్లో ఉన్నవారే ఏ కాస్త అవమానకరంగా ప్రవర్తించినా, దాన్ని కూడా సహించలేము.

**దాదాశ్రీ :** అయితే మరేం చేయాలి? ఇందులో ఉండకపోతే మరెందులో ఉండాలి? ఒక సంగతి చెప్పు. నేను చెప్తున్న ఈ లైను నచ్చకపోతే, ఆ వ్యక్తి మరెందులో ఉండాలి? మరేదైనా సేఫ్‌సైడ్ జాగా ఉందా? ఏదైనా ఉంటే నాకు చెప్పు.

**ప్రశ్నకర్త :** అలాంటిది లేదు, కాని మా 'ఇగో' అయితే ఉంటుంది కదా?

**దాదాశ్రీ :** జన్మతీసుకున్న దగ్గరి నుంచీ ఆపేది 'ఇగో' యే. కాని మనం అక్కడ ఆగిపోకూడదు. 'ఇగో' ఉంది, వాళ్ళు ఎలాగైనా నాట్యం చేయనీ, మనకు నాట్యం చేయవలసిన అవసరమేమీ లేదు. మనం వాళ్ళకి భిన్నంగా ఉంటాము.

## అదే లేకపోతే మిగతాదంతా మనోరంజకమే

ఉన్నవి రెండే రకాల ధర్మాలు. మూడవది లేదు. రెండవది ఆర్గ్యుమెంటే. ఆర్గ్యుమెంట్ పోర్షనే కాక, అందరూ "భేష్ భేష్" అని మెచ్చుకునేది కూడా.

సేవ లేనప్పుడు, ఏ రకమైన సేవా లేనప్పుడు, లోక సేవ అనేదే లేకపోతే, అంతా ధార్మిక మనోరంజనమే, అంతా ఆర్గ్యుమెంటల్ పోర్షనే.

బుద్ధి నుండి పుట్టే ధర్మం ఎంతవరకు స్వీకరించటం జరుగుతుందంటే, ఆ బుద్ధి సేవాభావంతో ఉన్నంత వరకు, జీవులకు సుఖాన్నిచ్చే బుద్ధి ఉంటే ఆ బుద్ధి మంచి బుద్ధి. మిగిలిన బుద్ధి పనికిరానిది. పైగా ఇతర రకమైన బుద్ధి బంధంలో పడేస్తుంది. కట్టిపడేసి దెబ్బలు తినిపిస్తుంది. ఎటు చూసినా, అందులో లాభనష్టాల బేరీజు వేస్తుంటుంది. బస్సులోపలికి వెళ్తూనే ఎక్కడ ఖాళీ ఉందా అని చూస్తుంటాం. అలా బుద్ధి అటూ ఇటూ పరుగులు తీస్తుంటుంది. ఇతరులకు సేవ చేసే బుద్ధి మంచిది. లేదంటే స్వయం సేవ చేసే బుద్ధి. అంతే. మరేదీ లేదు. స్వయం సేవ చేసేవారు లోకానికంతటికీ సేవచేసినట్లే.

## ఈ జగత్తులో ఎవరికీ దుఃఖం కలుగకుండుగాక

అందుకే అందరితో అంటూవుంటాను, "అరె అన్నా, ఉదయాన బయటకు వెళ్ళే సమయంలో, ఏమీ రాకపోతే కనీసం, "మనోవాక్కాయకర్మలతో, ఈ జగత్తులో ఏ జీవికీ కూడా కించిత్తు దుఃఖమైనా కలుగకుండుగాక" అని ఐదు సార్లు అని బయలుదేరు. ఇక మిగిలిన బాధ్యత నాది. పో, మరేమీ రాకపోతే నేను చూసుకుంటా. ఈమాత్రం అను చాలు. తర్వాత ఎవరికైనా దుఃఖం కలిగితే, అది నేను చూసుకుంటా. కాని ఇంత మాత్రం అను. అందులో ఏం పోతుంది?

**ప్రశ్నకర్త :** ఏం పోదు.

**దాదాశ్రీ :** నువ్వది తప్పకుండా అను. అప్పుడతను, "నేను దు:ఖాన్ని కలిగిస్తే?" అని అంటే, నువ్వదేమీ చూడకు. అదంతా నేను హైకోర్ట్‌లో చూసుకుంటా. ఆ వకీలుని చూడాలి కదా. అదంతా నేను చేస్తా. నేను చెప్పే ఈ వాక్యాన్ని ఉదయం ఐదుసార్లు అను. ఇందులో ఏమైనా సమస్యా, ఇందులో ఏమైనా కష్టముందా? చిత్త శుద్ధితో "దాదా భగవాన్" ని తలచుకుని అనరాదా, ఇందులో ఏమిటి కష్టం?

**ప్రశ్నకర్త :** అలాగే చేస్తా.

**దాదాశ్రీ :** అంతే అది చెయ్యి చాలు. మరేమీ చెయ్యవలసిన అవసరం లేదు ఈ ప్రపంచంలో.

## సంక్షిప్తంగా, వ్యవహార ధర్మం అంటే

ప్రపంచంలోని ప్రజానీకానికి వ్యవహార ధర్మం నేర్పటానికి నేను ఇలా చెప్తాను, పరానుగ్రహీ అయిపో. నీ గురించి ఆలోచనే వద్దు. లోక కళ్యాణం కోసం పరానుగ్రహి అయిపో. నీ కోసం నువ్వు ఖర్చు పెట్టుకుంటే అది గట్టర్‌లోకి పోతుంది. ఇతరుల కోసం ఎంత ఖర్చు పెట్టినా అది ముందు ముందు జరిగే అడ్జస్ట్‌మెంట్ అవుతుంది.

శుద్ధాత్మ భగవాన్ చెప్పేదేమిటంటే, ఇతరుల బాగోగులను చూసేవారి బాగోగులను నేను చూస్తాను, అలాగే, ఎవరైతే వారి బాగోగులను వారు చూసుకుంటారు, వాళ్ళని వాళ్ళ మానాన వదిలేస్తాను.

ప్రపంచం కోసం పనిచేయి, నీ పని జరిగిపోతుంటుంది. జగత్తు కోసం పనిచేస్తే నీ పని దానంతటదే జరిగిపోతుంది. అది మీకు ఆశ్చర్యం కలిగించవచ్చు.

ప్రపంచ స్వరూపం ఏమిటి? జగత్తులో జీవులలో భగవానుడు ఉన్నాడు. అందువలన ఏ జీవికైనా హాని కలిగిస్తే, దు:ఖాన్ని కలిగిస్తే అది అధర్మమౌతుంది.

ఏ జీవికైనా సుఖాన్నిస్తే అది ధర్మమౌతుంది. అధర్మానికి ఫలితం మీ ఇచ్ఛలకు విరుద్ధంగా ఉంటుంది, ధర్మానికి ఫలితం మీ ఇచ్ఛానుసారం ఉంటుంది.

"రిలేటివ్ ధర్మం" ఏదైతే ఉందో అది ప్రాపంచక మార్గం. సమాజసేవా మార్గం. మోక్షమార్గం, సమాజసేవకంటే ఉత్తమమైనది. స్వ-రమణత అది.

## ధర్మానికి ప్రారంభం

మనిషి ఎప్పుడైతే ఇతర వ్యక్తికి సుఖాన్నివ్వటాన్ని ప్రారంభించాడో, అప్పటి నుంచే ధర్మం ప్రారంభమైంది. తన సొంత సుఖం కాకుండా, ఎదుటివాని బాధలను ఎలా తొలగించాలి అనే దానితో కారుణ్య భావం ప్రారంభమౌతుంది. నాకైతే చిన్నప్పటి నుంచే ఎదుటివారి కష్టాలను తొలిగించాలి అనేది వచ్చిపడింది. నా కోసం విచారమే లేదు. దాన్ని కరుణ అంటారు. దానితో జ్ఞానం ఉదయిస్తుంది.

రిటైర్ అయ్యే సమయంలో ఆనరరీ ప్రెసిడెంట్ అవుతాడు. ఆనరరీ ఎవరంటే, అరె మూర్ఖుడా, ఎందుకు అనవసరంగా చిక్కులెందుకు తగిలించుకుంటావు? ఇప్పుడు, రిటైర్ అయ్యే ముందు కూడానా? చికాకులే దాని వలన. ఈ చికాకులన్నీ పెట్టుకుంటావు.

మరో సంగతి ఏమిటంటే, ఎవరికైనా సేవ చెయ్యలేకపోతే, ఎవరికీ దు:ఖం కలుగకూడదు అని అనుకో. నష్టమే జరగవచ్చు. అది పూర్వ జన్మలోని బాకీ అయ్యుండవచ్చు. కానీ, అతనికి బాధ కలుగకూడదనే అనుకోవాలి.

## ఇది నేర్చుకుంటే చాలు

**ప్రశ్నకర్త :** ఇతరుల సుఖాన్ని చూసినవాడు తానూ సుఖాలను పొందుతాడు

**దాదాశ్రీ :** చాలు. ఇది తెలుసుకుంటే చాలు. వేరేదీ నేర్చుకోనక్కర్లేదు. ప్రపంచంలో మరో ధర్మమేదీ లేదు. ఇంతే ధర్మమంటే. వేరే ధర్మమేమీ లేదు. ఇతరులకు సుఖాన్నివ్వు, దానితోనే నీవూ సుఖాన్ని అనుభవిస్తావు.

వ్యాపారంలో ఉన్నట్లయితే, ఏదైనా సంపాదిస్తున్నట్లయితే, ఏదైనా గ్రామానికి పోయి అక్కడ కష్టాల్లో ఉన్నవారికి బియ్యం ఇవ్వు. అమ్మాయి పెళ్ళి చేస్తున్నట్లయితే కొంచెం డబ్బు ఇవ్వు. అలా అతని బండిని దార్లోకి తీసుకునిరావాలి కదా. ఎవరికైనా మనసు చల్లబడితే, భగవానుడు మన మనసుని కూడా చల్లబరుస్తాడు.

## జ్ఞాని గ్యారెంటీ పత్రానిస్తాడు

**ప్రశ్నకర్త :** ఎవరి మనసునైనా చల్లబరుద్దామని పోతే మన జేబుకే చిల్లి పడుతుంది.

**దాదాశ్రీ :** జేబుకి చిల్లిపడవచ్చు. అది పూర్వజన్మ లెక్క అయ్యుంటుంది, ఇప్పుడు తీర్చేస్తున్నావు. కానీ ఇప్పుడు చల్లబరచినందుకు ఫలం మీకు అందుతుంది. అందుకు నూటికి నూరు శాతం గ్యారెంటీ పత్రాన్నిస్తాను నేను. నేను అలా చేసుంటాను. అందుకే నాకు ఇప్పుడు ఎంతో సుఖంగా గడుస్తోంది. సుఖపు దుకాణాన్ని తెరవటమే నా పని. దుఃఖం కలిగించే దుకాణాన్ని నేను తెరవను. ఇది సుఖాన్ని కలిగించే దుకాణం, ఎవరికి ఎంత కావాలంటే అంత సుఖాన్ని తీసుకునిపోండి. ఎవరైనా దుఃఖాన్నివ్వటానికి వస్తే, నేను అనేది, “ఓహొూహొూ ఇంకా నా బాకీ ఉంది తేతే” అని. అతనికి నేను మరో అవకాశం ఇస్తాను. దుఃఖాన్నివ్వటానికి వస్తే తీసుకుపో. నా లెక్కలో బాకీ ఉంటే తప్పక వస్తాడు కదా! అదే లేకపోతే నాకు దు:ఖాన్ని కలిగించటానికి ఎవరూ రారు.

అందువలన సుఖాన్ని అందించే దుకాణం ఎలా నడపుతావంటే, అందరికీ సుఖాన్నివ్వాలంతే. ఎవరికీ దుఃఖాన్నివ్వొద్దు. దుఃఖాన్ని కలిగించేవాడికి ఎప్పుడో ఒక రోజు ఎవరో ఒకరు చాకు తీసుకుని పొడిచి చంపరూ? అతను ఎదురుచూస్తూ ఉంటాడు. ద్వేషానికి ద్వేషం వసూలుచేసుకునేవారు ఊరికే చెయ్యరు. దుఃఖానికి బదులు తీర్చుకుంటారు.

# సేవ అందిస్తే సేవ లభిస్తుంది

ఈ ప్రపంచంలో ప్రప్రథమంగా సేవ చేయతగినవారంటూ ఉంటే వారు తల్లిదండ్రులు.

తల్లిదండ్రుల సేవ చేస్తే శాంతి వీడకుండా ఉంటుంది. కానీ ఈ కాలంలో తల్లిదండ్రుల సేవను హృదయపూర్వకంగా చేయటం లేదు. 30 సంవత్సరాలకు వచ్చేసరికి గురువు (భార్య) వచ్చేస్తుంది. నన్ను కొత్త ఇంటికి తీసుకునిపో అంటుందామె. గురువుని చూసారా మీరు? 25, 30 సంవత్సరాలలో గురువు దొరుకుతుంది, అలా గురువు దొరకగానే మార్పు వచ్చేస్తుంది. గురువు అంటుంది, నువ్వు నీ తల్లిదండ్రులను పట్టించుకోకు అని. ఒకసారి చెప్తే వినడు. మొదటిసారి వినడు కానీ రెండు మూడు సార్లు చెప్పేసరికి పట్టాలు మారిపోతాడు.

ఇకపోతే, తల్లిదండ్రులకు శుద్ధ సేవ చేసినట్లయితే, ఆ మనిషికి ఈ జగత్తులో అశాంతి అనేదే ఉండదు. ఈ జగత్తులో ఏదీ తీసి పారేసేది ఉండదు. అప్పుడు అందరూ, తప్పంతా మగ పిల్లలదే అంటారు. మగపిల్లలు తల్లిదండ్రులకు సేవ చేయరు. అందులో తల్లిదండ్రులదేం తప్పు? వాళ్ళు తమ తల్లిదండ్రులకు సేవచేయలేదు, అందుకే వాళ్ళకీ ప్రాప్తి లేదు అంటాను నేను. అంటే ఈ పరంపరే తప్పుగా నడుస్తోంది. ఇప్పటికైనా పరంపర కొత్త విధానంలోకి మారితే మంచిది.

అందువలన నేను ప్రతి ఇంట్లో అలా సేవ చేయిస్తాను. మగపిల్లలంతా ఆల్‌రైట్ అయిపోయారు. తల్లిదండ్రులు కూడా ఆల్‌రైట్, పిల్లవాడు కూడా ఆల్‌రైట్.

పెద్దవాళ్ళ సేవచేస్తే మనలో విజ్ఞానం వికాసం చెందుతుంది. విగ్రహారాధనలో సేవ జరుగుతుంటుంది. విగ్రహాల కాళ్ళు నొప్పులు పెడతాయా? సేవను భావపూర్తితో చేయాలి, తల్లిదండ్రులైనా లేక గురువైనా.

## సేవని వదిలేసి ధర్మాన్ని పాటించవచ్చా?

తల్లిదండ్రులకు సేవచేయటమే ధర్మం. ఆ లెక్క ఎలాగైనా రానీ కానీ, సేవ చేయటమైతే మన ధర్మం. ధర్మాన్ని ఎంత పాలిస్తే మనకి అంత సుఖ ప్రాప్తి జరుగుతుంది. పెద్దవాళ్ళకి సేవతో పాటు మనకి సుఖప్రాప్తి కూడా జరుగుతుంది. తల్లిదండ్రుల సుఖాన్ని చూస్తే మనకి సుఖం కలుగుతుంది. తల్లిదండ్రుల సౌఖ్యాన్ని చూసుకున్నవారికి, ఎప్పటికీ దు:ఖమనేదే కలుగదు.

ఒక పెద్ద ఆశ్రమంలో ఒక వ్యక్తి కలిసాడు. “మీరు ఇక్కడకి ఎక్కడి నుంచి వచ్చారు?” అని అడిగాను. అప్పుడతను, “గత పది సంవత్సరాలుగా ఇక్కడే ఉంటున్నాను” అన్నాడు. నేనతనితో, “మీ గ్రామంలో మీ తల్లిదండ్రులు అంతిమ ఘడియల్లో పేదరికంలో చాల దు:ఖంలో ఉన్నారు” అని చెప్పాను. దానికతను, “అందుకు నేనేం చెయ్యను? నేను వాళ్ళకి సేవ చేయటానికి వెళ్తే, నేను చేసే ధర్మ కార్యం నిలిచిపోతుంది” అన్నాడు. అదెక్కడి ధర్మం? తల్లిదండ్రులతో మాట్లాడటం, అన్నదమ్ములు, అందరితో మాట్లాడటం ధర్మమంటే. తన స్వధర్మానికి వ్యతిరేకంగా, తల్లిదండ్రుల సంబంధాన్ని తిరస్కరించి, దాన్ని ధర్మమంటారా?

మీ తల్లిదండ్రులున్నారా?

**ప్రశ్నకర్త :** అమ్మ ఉంది.

**దాదాశ్రీ :** ఇక సేవ చేయండి బాగా. ప్రతిసారి కలిసిరాదు. ఎవరైనా వ్యక్తి నాతో, “నేను చాల దు:ఖంలో ఉన్నాను” అంటే, మీ తల్లిదండ్రుల సేవ చెయ్యి, బాగా, అని చెప్తాను. అలా చేస్తే ప్రాపంచిక కష్టాలు మీ దరికి రావు. దానివలన గొప్ప ధనికుడవు కాకపోవచ్చు కానీ దు:ఖితుడవైతే అవవు. ధర్మాన్ని పాటించాలి. దీన్ని ధర్మమని ఎలా అంటాం? నేను కూడా మాతాజీ సేవ చేసాను. ఇరవై సంవత్సరాల వయసులో అంటే యువావస్థలో ఉన్నాను. కనుకనే మాతాజీ

సేవ చేయగలిగాను. తండ్రికి భుజం పట్టి తీసుకెళ్ళాను. అంతే చేసిన సేవ. లెక్క చూస్తే, అలాంటి తండ్రులు ఎంతమందయ్యారో. ఇప్పుడేం చెయ్యాలి? దానికి సమాధానం ఇలా వచ్చింది, "ఇప్పుడెవరున్నారో వాళ్ళకి సేవ చెయ్యి" అని. ఎవరైతే వెళ్ళిపోయారో, వాళ్ళు గాన్. కాని ఇప్పుడున్నవారికి సేవ చెయ్యి. ఒకవేళ లేకపోతే చింతించకు. చాల అయ్యాయి కదా. ఎక్కడ నుంచి మర్చిపోయావో, అక్కడి నుంచి లెక్కపెట్టటం మొదలుపెట్టు. తల్లిదండ్రుల సేవ అనేది ప్రత్యక్షంగా ముందున్న ధనం. భగవంతుడు కనపడడు కాని వీళ్ళయితే కనిపిస్తున్నారు కదా. భగవంతుడెక్కడ కనిపిస్తాడు? కాని, తల్లిదండ్రులైతే కనిపిస్తారు కదా.

## నిజానికి సేవ అవసరం ఉండేది వయసు మళ్ళినవారికే

ఇప్పుడెవరైనా చాల ఎక్కువ దు:ఖంలో ఉన్నారంటే, ఔను ఉన్నారు. అరవై, అరవైఐదు సంవత్సరాలు ముసలివారు. ఈ కాలంలో వాళ్ళు చాల బాధలు పడుతున్నారు. కాని వాళ్ళు ఎవరికి చెప్పుకుంటారు? పిల్లలేమో వినరు. దూరాలు పెరిగిపోయాయి- పాత కాలం, కొత్త కాలం. ముసలివారు పాతకాలాన్ని వదిలిపెట్టరు. దెబ్బతింటుంటారు కాని వదిలిపెట్టరు.

**ప్రశ్నకర్త :** అరవై ఐదు సంవత్సరాల వయసులో అందరి పరిస్థితీ ఇలాగే ఉంటుంది కదా.

**దాదాశ్రీ :** ఔను అదే పరిస్థితి. సరిగ్గా అదే పరిస్థితి. అందువలన నిజానికి మనం ఈ ప్రపంచంలో చెయ్యగలిగింది ఏముంది? అటువంటి పెద్దవాళ్ళకి ఎక్కడైనా ఉండటానికి ఒక చోటు ఏర్పాటు చేస్తే అది చాల మంచి పని అవుతుంది. అందువలన నేను అనుకున్నదేమిటంటే, అలా చేయలేకపోయినా ముందుగా ఈ జ్ఞానాన్నయితే వాళ్ళకి ఇద్దాం అని. ఆ తర్వాత వాళ్ళు తినటానికి, తాగటానికి అయ్యే ఖర్చులను పబ్లిక్‌లో ఎవరికైనా లేక ఏదైనా స్వచ్ఛంద సంస్థకి

ఇస్తే పని నడిచిపోతుంది కదా అనుకున్నా. ఈ జ్ఞానాన్ని అందిస్తే వాళ్ళు పొందే దర్శనం కూడా మంచిదే కదా. ఈ జ్ఞానాన్ని పొందిన తర్వాత వాళ్ళకి పాపం మనశ్శాంతయినా దొరుకుతుంది. లేకపోతే దేని ఆధారంగా ప్రశాంతంగా జీవించగలరు? మీకెలా అనిపించింది?

**ప్రశ్నకర్త :** బావుంది.

**దాదాశ్రీ :** ఈ మాటలు మీకు నచ్చాయనుకుంటా.

వృద్ధావస్థలో అరవై అరవైఐదు సంవత్సరాల వయసులో ఉన్నవారు ఇంట్లో ఉన్నపుడు, వాళ్ళనెవరూ పట్టించుకోకపోతే ఏమౌతుంది? నోటితో ఏం చెప్పలేరు, ఆ పైన మనసులో కర్మ బంధాలు ఏర్పడుతుంటాయి. అందుకే వాళ్ళు వృద్ధాశ్రమ వ్యవస్థను తయారుచేసారు. అలా చేయటం తప్పేమీ కాదు. అది హెల్పింగ్ అవుతుంది. కానీ దానికి వృద్ధాశ్రమం కాకుండా ఏదైనా గౌరవప్రదమైన పేరు పెట్టాలి, ఆ పేరు వాళ్ళకి గౌరవాన్నివ్వాలి.

## సేవతో జీవితంలో సుఖసంపత్తి

ముందుగా జన్మనిచ్చిన తల్లిదండ్రులకు సేవ, ఆ తర్వాత గురుసేవ! గురువులు, తల్లిదండ్రుల సేవయితే తప్పక చేయాలి. గురువు మంచివాడు కాకపోతే సేవ చేయటం మానేయాలి.

**ప్రశ్నకర్త :** తల్లిదండ్రుల సేవ చేయనివారున్నారిప్పుడు. వాళ్ళ సంగతేమిటి? అటువంటివాళ్ళకేం గతి లభిస్తుంది?

**దాదాశ్రీ :** తల్లిదండ్రుల సేవ చేయనివారు ఈ జన్మలో సుఖంగా జీవించలేరు. తల్లిదండ్రులకు సేవచేసిన ప్రత్యక్ష నిదర్శనం ఏమిటి? అని అడిగితే, జీవితకాలమంతా దుఖం అనేదే లేకుండా జీవిస్తారు అని చెప్తాను. తల్లిదండ్రులకు సేవ చేయటం వలన, ఎటువంటి ఇబ్బందులు, ఆటంకాలు కూడా వారికి రావు.

భారతదేశంలోని విజ్ఞానం చాల సుందరమైనదిగా ఉండేది. అందుకే శాస్త్రకర్తలు, తల్లిదండ్రులకు సేవ చేయండి, మీకు ధనం లేదన్న బాధే కలుగదు అని గ్రంథస్థం చేసారు. అది న్యాయబద్ధమే కదా. దాని సంగతి పక్కన పెడితే, తల్లిదండ్రులు సేవకి యోగ్యులు. ఎందుకంటే మీరు వాళ్ళకి సేవ చేయనట్లయితే, మీరు ఎవరి నుండి సేవలు పొందుతారు? మీ తర్వాత తరంవారు మీరు సేవకి యోగ్యులన్న విషయాన్ని ఎలా తెలుసుకుంటారు? పిల్లలు అన్నీ గమనిస్తుంటారు. మా నాన్న ఆయన నాన్నకి సేవ చేయలేదు అన్నది చూస్తారు. అలాంటప్పుడు వాళ్ళకి ఆ సంస్కారం ఎక్కడి నుండి వస్తుంది?

**ప్రశ్నకర్త :** నా ఉద్దేశ్యం ఏమిటంటే, తండ్రిపట్ల తనయుని బాధ్యత ఏమిటి?

**దాదాశ్రీ :** తండ్రిపట్ల తనయుడు తన బాధ్యతను నెరవేర్చాలి. అలా కొడుకు తన తండ్రి పట్ల బాధ్యతను నెరవేర్చినట్లయితే కలిగే లాభమేమిటి? ఏ కొడుకైతే తన తల్లిదండ్రులకు సేవ చేస్తాడో, అతనికి డబ్బుకి కొదవ ఎప్పుడూ ఉండదు. అతని అవసరాలన్నీ తీరిపోతుంటాయి. గురుసేవ చేస్తే, మోక్షం కలుగుతుంది. కానీ ఈ రోజుల్లో మనుషులు తల్లిదండ్రులు, లేక గురువులకు సేవచేయరు కదా. అటువంటివాళ్ళంతా దు:ఖాల బారినపడతారు.

## తల్లిదండ్రులు గొప్ప ఉపకారులు

తల్లిదండ్రులలో తప్పులను వెతికేవారికి సమృద్ధి ఎప్పుడూ లభించదు. డబ్బు సంపాదించినా ఒకవేళ, ఆధ్యాత్మిక ఉన్నతయితే ఉండదు. తల్లిదండ్రులలో తప్పులను వెదకగూడదు. వాళ్ళ ఉపకారాన్ని ఎలా మర్చిపోతారు? ఎవరైనా టీ తాగిస్తేనే వాళ్ళ ఉపకారాన్ని మర్చిపోరే, అలాంటిది తల్లిదండ్రులు చేసిన ఉపకారాన్ని ఎలా మర్చిపోతారు? అర్థమైందా నీకు? అంటే, వాళ్ళది ఎంతో ఉపకారమని తెలుసుకోవాలి. బాగా చూసుకోండి, తల్లిదండ్రులకు బాగా సేవచేయండి.

ప్రపంచంలో ఉపకారం చేసిన ముగ్గురికి ఋణపడివుంటాము. ఫాదర్, మదర్, గురువుల ఉపకారాలను విస్మరించగూడదు. మనకు మార్గాన్ని చూపించిన ఈ ముగ్గురి ఉపకారాలు మర్చిపోయేవి కావు.

## 'జ్ఞాని' కి చేసిన సేవా ఫలితం

మన సేవా తత్వాన్ని గుప్తంగా ఉంచుతూ సేవకుడనే భావంతో పనిచేయాలి. 'జ్ఞాని పురుష్' అయితే ప్రపంచానికంతటికీ సేవకుడు, సేవ్య అనబడతాడు. ప్రపంచానికంతటికీ నేనే సేవచేస్తాను, ప్రపంచమంతటి నుంచీ నేనే సేవను గ్రహిస్తాను. ఇది మీకు అర్థమైతే మీరు పని తీరిపోయినట్లే భావించండి.

'మేము' ఎంతవరకు బాధ్యతను తీసుకుంటామంటే, ఎవరైనా మమ్మల్ని కలవటానికి వస్తే, వాళ్ళకి దర్శన భాగ్యమైతే కలుగవలసిందే. ఎవరైనా మాకు సేవచేస్తే వారి పట్ల మా బాధ్యత పెరుగుతుంది. వాళ్ళనికి మోక్షంలోకి తీసుకునివెళ్ళవలసిందే.

**జై సచ్చిదానంద**

## శుద్ధాత్మకి ప్రార్థన

హే అంతర్యామీ పరమాత్మా! నీవు నాలో ఉన్నవిధంగానే జీవులందరిలో విరాజమానమై వున్నావు. నీ యొక్క దివ్య స్వరూపమే నా నిజ స్వరూపము. నా నిజ స్వరూపము పవిత్ర ఆత్మ.

హే శుద్ధాత్మ భగవాన్! నేను నీకు అభేదభావముతో అత్యంతభక్తి పూర్వకంగా నమస్కరించుచున్నాను.

అజ్ఞానవశాత్తు నేను చేసిన తప్పులనన్నింటిని ❖ నీ ముందు ఒప్పుకొనుచున్నాను. నేను ఈ తప్పులకు పశ్చాత్తాపం చెందుతూ నీ క్షమకై అర్థిస్తున్నాను. ప్రభూ! దయతో నన్ను క్షమించు, నన్ను క్షమించు, నన్ను క్షమించు. ఆ తప్పులను మరల చేయకుండునట్లు నాకు శక్తిని ప్రసాదించు.

హే శుద్ధాత్మ భగవాన్! మాకు నీతోగల భేద భావము తొలగిపోయి మేమందరము నీతో అభేదతను పొందునట్లు ఆశీర్వదించు. మేము సదా నీతో అభేదతతో తన్మయాకారతను చెందెదము గాక!

(❖ గతంలో నీవు చేసిన తప్పులను గుర్తు తెచ్చుకోవాలి)

## ప్రతిక్రమణ : దివ్యమైన క్షమాపణా విధానము

నేను దాదా భగవాన్ సాక్షిగా ❖...................... యొక్క మనోవచన కాయము కంటె పూర్తిగా వేరైన పవిత్రాత్మకు నమస్కరించుచున్నాను.

నేను నా తప్పులను జ్ఞప్తికి తెచ్చుకొన్నాను (ఆలోచన) ❖❖

ఆ తప్పులకై నేను క్షమాపణ కోరుచున్నాను (ప్రతిక్రమణ)

ఆ తప్పులను మరల చేయనని దృఢముగా నిశ్చయించుకొనుచున్నాను (ప్రత్యాఖ్యాన్)

ప్రియాతి ప్రియమైన దాదాభగవాన్! ఈ దృఢ నిశ్చయమును పాలించు శక్తిని నాకు అనుగ్రహించు.

❖ మీ వలన గాయపడిన వ్యక్తి పేరు

❖❖ ఆ వ్యక్తిపట్ల మీరు ఒనర్చిన దోషాలను గుర్తుచేసుకోవాలి.

# తెలుగులో దాదా భగవాన్ పుస్తకాలు

| | |
|---|---|
| 1. | అన్ని చోట్లా సర్దుబాటు |
| 2. | విభేదాలను తొలగించడానికి |
| 3. | ఎలాగైనా జస్టిస్ జరిగింది |
| 4. | బాధితుడు తప్పిదము |
| 5. | క్రోధం |
| 6. | చింత |
| 7. | నేను ఎవరు? |
| 8. | భావనతో మెరుగుపడతాయి జన్మ-జన్మలు |
| 9. | మృత్యు సమయం దానికి ముందు, దాని తర్వాత... |
| 10. | ఆత్మ సాక్షాత్కారం |
| 11. | మానవ ధర్మం |
| 12. | సేవ, పరోపకారం |
| 13. | ప్రతిక్రమణ |
| 14. | భార్యాభర్తల దివ్య వ్యవహారం |
| 15. | అంతఃకరణ స్వరూపం |


❖ తెలుగులో మరిన్ని పుస్తకాలు జోడించబడుతున్నాయి మరియు త్వరలో అందుబాటులోకి వస్తాయి.

❖ Dada Bhagwan books are available in different languages: Gujarati, Hindi, English, Marathi, Telugu, Kannada, Oriya, Malayalam, Bengali, Punjabi, Assamese, Tamil, German, Spanish, Russian, etc.

❖ 'Dadavani' Magazine is published every month in three languages: Gujarati, Hindi & English.

❖ All Dada Bhagwan books and magazines are also available on online book store : https://store.dadabhagwan.org

# దాదా భగవాన్ ఫౌండేషన్ తెలుగు యూట్యూబ్ ఛానల్




❖ ఇది అడాలజ్ దాదా భగవాన్ ఫౌండేషన్ యొక్క అధికారిక తెలుగు యూట్యూబ్ ఛానెల్.

❖ దిగువ లింక్ నుండి తెలుగు భాషలో సత్సంగ వీడియోలను చూడండి.

**‘Dada Bhagwan Foundation Telugu’ Channel:**

https://dbf.adalaj.org/yttelugu

*Open Link OR*

*Scan QR*

---

*Dada Bhagwan Foundation Youtube video channels are available in other regional languages: Gujarati, Hindi, Marathi, Bengali, Tamil, Telugu, Kannada, Malayalam, Spanish, Portuguese, etc.*

# Persons to Contact

## Dada Bhagwan Foundation


**Adalaj** : **Trimandir**, Simandhar City, Ahmedabad-Kalol Highway
P/O: Adalaj, Dist. Gandhinagar - 382421, Gujarat, India.
Tel: +91-9328661166 / 9328661177
E-mail : info@dadabhagwan.org

**Mumbai** : **Trimandir**, Rushivan, Kajupada, Borivali (E)
Tel: +91-9323528901


| | | | |
|---|---|---|---|
| **Kolkata:** | 9830093230 | **Delhi:** | 9810098564 |
| **Jaipur:** | 9351408285 | **Chennai:** | 7200740000 |
| **Bhopal:** | 9425024405 | **Patna:** | 7352723132 |
| **Indore:** | 9039936173 | **Amravati:** | 9422915064 |
| **Raipur:** | 9329644433 | **Bangalore:** | 9590979099 |
| **Chandigarh:** | 9780732237 | **Hyderabad:** | 9989877786 |
| **Kanpur:** | 9452525981 | **Pune:** | 9422660497 |
| **Bhubaneswar:** | 8763073111 | **Jalandhar**: | 9814063043 |
| **Varanasi:** | 9795228541 | **Sangli:** | 9423870798 |

| | |
|---|---|
| **USA: Dada Bhagwan Vignan Institute**<br>Tel: + 1-877-505-DADA (3232)<br>Email: info@us.dadabhagwan.org | **U.K: Dada Darshan (UK)**<br>Tel: +44 330-111-DADA (3232)<br>Email: info@uk.dadabhagwan.org |
| **Germany** : +49 700 32327474<br>**UAE** : +97 1557316937<br>**Kenya** : +25 4722722063<br>**Dubai** : +971 501364530 | **Australia** : +61 421127947<br>**Singapore** : +65 81129229<br>**New Zealand** : +64 210376434 |

Website : www.dadabhagwan.org



## సేవాఫలం

జగత్తు కోసం పని చేయి, నీ పని తీరిపోతుంటుంది. జగత్తు పనిచేస్తుంటే మీ పని దానంతటదే నెరవేరి, మీకు ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది.

మనిషి ఎవరికైనా సుఖాన్నివ్వటం ప్రారంభించినపుడే, ధర్మం ప్రారంభమైంది. ఎప్పుడైనా మీకు సుఖం లేదని అనిపించినపుడు, పోనీ ఎదుటివారి కష్టాలు ఎలా తొలుగుతాయా అని ఆలోచిస్తే అప్పటి నుంచే మీలో కరుణ ప్రారంభమౌతుంది. మాకు చిన్నప్పటి నుంచే ఎదుటివారి కష్టాలను దూరం చెయ్యాలా అనన కోరిక ఉండేది. నా గురించి ఎటువంటి ఆలోచనా రాదు. దాన్ని కారుణ్యం అంటారు. దానితోనే జ్ఞానం ఉదయిస్తుంది.

–దాదాశ్రీ

मूल दीपक से प्रकटे दीपमाला

dadabhagwan.org

9 789391 375584

Printed in India

Price ₹ 40